
నాడు గలగల.. నేడు వెలవెల..!

కుప్పం ప్రాంతంలో ప్రస్తుతం నెలకొన్న దుర్భిక్ష పరిస్థితులకు ఈ చిత్రమే నిదర్శనం. ఎప్పుడూ నీటి సవ్వడులతో గలగల పారే పాలారు ఒలా బోసిపోయి కనిపిస్తూ కరవుగా సజీవ సాక్ష్యంగా నిలుస్తోంది. ఈ ఏడాది తీవ్రమైన వర్షాభావంతో పాలారుతో పాటు నాలుగు మండలాల్లోని చెరువులు, కుంటల్లో నీటి కొరత ఏర్పడింది. కనీసం పశు పక్షాదులకు తాగునీటి లభ్యత లేకుంది. భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయి. రెండేళ్ల కిందట వర్షాకాలంలో పరవళ్లతో.. గలగలా ప్రవహించిన పాలారు ప్రస్తుత వర్షాకాలంలోనే ఇలా ఎండిపోవడంపై అన్నదాతలు కలత చెందుతున్నారు. నియోజకవర్గంలో నీటి కరవు శాశ్వత పరిష్కారానికి చంద్రబాబు ప్రభుత్వం తీసుకొచ్చిన 'హంద్రీ-నీవా' జలాలపైనే కుప్పం ప్రజలు కోటి ఆశలు పెట్టుకున్నారు. - న్యూస్‌టుడే, కుప్పం



శాంతిపురం మండలం శివరామపురం వద్ద ఎండిపోయిన పాలారు నది



రెండేళ్ల కిందట నీటి పరవళ్లు (పాత చిత్రం)

ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ రాక నేడు

తిరుపతి (బైరాగిపట్టెడ): ఉప ముఖ్యమంత్రి హోదాలో జనసేన అధినేత పవన్ కల్యాణ్ తొలిసారిగా తిరుపతి పర్యటనకు మంగళవారం సాయంత్రం రానున్నారు. పార్టీ నేతలు, కార్యకర్తలు రేణిగుంట విమానాశ్రయం నుంచి తిరుపతి వరకు వాహన, బైక్ ర్యాలీలు నిర్వహించనున్నారు. బుధవారం తిరుమలలో స్వామివారిని దర్శించుకుని వారాహి దీక్ష విరమించనున్నారు. అనంతరం స్థానికంగా పర్యటించనున్నారు. గురువారం తిరుపతిలోని జ్యోతిరావు పులే కూడలిలో బహిరంగ సభను ఉద్దేశించి ప్రసంగించనున్నారు.



వలసలు నివారించేలా..

కుప్పంలో ఉపాధికి శ్రీకారం

పారిశ్రామిక ప్రగతి దిశగా అడుగులు



ఏపీఐఐసీ భూముల్లో ఆహార అనుబంధ పరిశ్రమ నిర్మాణం పనులు

కుప్పం, న్యూస్‌టుడే: కుప్పం నియోజకవర్గంలో పారిశ్రామిక ప్రగతి.. వలసల నివారణ లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. నిరుద్యోగులు, యువతకు అందుబాటులో ఉపాధి సాకారం దిశగా నిర్దేశిత కార్యాచరణకు కూటమి సర్కారు శ్రీకారం చుట్టింది. పరిశ్రమల ఏర్పాటులో పెట్టుబడిదారులను అన్ని విధాలా ప్రోత్సహిస్తోంది.

రూ.7 కోట్లతో ఆహార అనుబంధ పరిశ్రమ

శాంతిపురం మండలం రాళ్లబూదుగూరు పంచాయతీ రెడ్డివారిపల్లె వద్ద ఆహార అనుబంధ పరిశ్రమ ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. సుమారు రూ.7 కోట్లు పెట్టుబడితో నిర్మించనున్న పరిశ్రమలో వివిధ రకాల కూరగాయల ప్రాసెసింగ్‌తో పాటు సుగంధ ద్రవ్యాల పౌడర్లను తయారు చేసి ఎగుమతి చేయనున్నారు. దాదాపు 300 మందికి ఉపాధి లభించనుంది.

2014-19 లో భూసేకరణ

2014-19లో ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనలో ఇక్కడ పారిశ్రామిక అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. కుప్పం పట్టణానికి కూతవేటు దూరంలోని తమ్మిగానిపల్లె వద్ద కుప్పం-కృష్ణగిరి జాతీయ రహదారి పక్కన పారిశ్రామికవాడను నెలకొల్పారు. దాదాపు 20 వరకు ఆహార అనుబంధ పరిశ్రమలు, స్టీల్, గార్మెంట్ యూనిట్లలో 2 వేల మందికి పైబడి ఉపాధిని పొందుతున్నారు. రామకుప్పం-శాంతిపురం మండలాల సరిహద్దులోని రామాపురం, అమ్మవారిపేట, పెద్దూరు వద్ద భూసేకరణ చేపట్టారు. గుడుపల్లె మండలంలోని పోగురుపల్లె వద్ద సేకరించిన భూముల్లో కొన్ని రకాల పరిశ్రమలు ఏర్పాటు కానున్నాయి.

2 వేల ఎకరాల్లో పారిశ్రామిక ప్రగతి

నియోజకవర్గంలో 2 వేల ఎకరాల్లో పారిశ్రామిక ప్రగతి లక్ష్యంగా భూములను సేకరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆయా మండలాల్లో రవాణా, నీరు, విద్యుత్తు తదితర వసతులు ఉండేలా చర్యలు తీసుకోవడంతో పాటు ప్రభుత్వ బీడు భూములను సేకరించాలని నిర్దేశించింది.

హామీకి అనుగుణంగా..

కుప్పం ప్రాంతం నుంచి పదో తరగతి, ఇంటర్, డిగ్రీ విద్యార్హత కలిగిన వేలాది మంది ఉపాధి కోసం బెంగళూరు వలస పోతున్నారు. వలసలను అరికట్టి యువతకు ఇక్కడే ఉపాధిని సాకారం చేస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. గ్రానైట్‌లో శిల్పాల తయారీతో పాటు స్థానికంగా పండించే ఉద్యాన పంటల ప్రాసెసింగ్ పరిశ్రమల ఏర్పాటు ద్వారా నిరుద్యోగ సమస్యకు పరిష్కారం చూపుతారు.

ఎంతో ఆనందం

మాలాంటి చదువుకున్న యువతకు అందుబాటులో ఉపాధి లభిస్తే అంతకన్నా సంతోషించే విషయం మరొకటి ఉండదు. కార్మికులు, యువతకు స్థానికంగానే ఉద్యోగాలు లభించేలా ఆయా మండలాల్లోనే పరిశ్రమలను ఏర్పాటు చేస్తే బాగుంటుంది. ఉపాధి, వృత్తి నైపుణ్యం శిక్షణ ఇప్పించాలి.
- మనోహర్, బీటీపల్లె, శాంతిపురం మండలం

క్రీడా వికాస కేంద్రాలకు మహర్దశ

కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

ఈనాడు, చిత్తూరు: క్రీడా రంగాన్ని ఐదేళ్లపాటు వైకాపా నిర్లక్ష్యం చేసింది.. నూతన మైదానాల నిర్మాణానికి, గతంలో మొదలైన పనుల కొనసాగింపునకు ఏమాత్రం శ్రద్ధ చూపలేదు. డబ్బులు దండుకునేందుకు 'ఆడుదాం.. ఆంధ్రా' వంటి కార్యక్రమాలు నిర్వహించి ఆ సొమ్మును జేబుల్లో వేసుకున్నారు. సాక్షాత్తు క్రీడా శాఖ మంత్రి రోజా జిల్లాకే చెందిన వ్యక్తి అయినప్పటికీ ఎటువంటి ప్రయోజనం ఒనగూరలేదు. అమాత్యురాలిగా బాధ్యతలు స్వీకరించిన తొలినాళ్లలో అధికారులతో ఆఘమేఘాలపై సమీక్షలు నిర్వహించినా పదవీ కాలం చివర్లో ఆమె పురోగతిని పరిశీలిస్తే సాధించింది శూన్యమే అని చెప్పవచ్చు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అర్ధాంతరంగా నిలిచిన క్రీడా వికాస కేంద్రాలు, మినీ స్టేడియాల నిర్మాణాన్ని పట్టాలెక్కించే పనిలో పడింది. ఈ క్రమంలోనే ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు నిధుల మంజూరుకు పచ్చ జెండా ఊపారు.

ఒక్కో కేంద్రానికి రూ.2 కోట్లు మంజూరు..

2014-19 మధ్య తెదేపా అధికారంలో ఉన్న సమయంలో ప్రతి నియోజకవర్గంలోనూ క్రీడా వికాస కేంద్రాల నిర్మాణానికి ఆమోదం తెలిపింది. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తోన్న కుప్పం నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లోనూ ఒక్కోటి అందుబాటులోకి తేవాలని ఆయన ఆదేశించారు. జిల్లాలో పలమనేరు, వి.కోట, పుంగనూరు, నగరి, పూతలపట్టు, గంగాధరనెల్లూరు, చిత్తూరు, కుప్పం, రామకుప్పం, గుడుపల్లె, శాంతిపురంలో మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. ఈమేరకు స్థల సేకరణ చేపట్టాలని అందులో పేర్కొన్నారు. గుడుపల్లె, శాంతిపురం, చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పుంగనూరులో సరిపడా భూమి లేనందున మినీ స్టేడియాలు నిర్మించాలని ప్రతిపాదించారు.

తెదేపా హయాంలోనే మూడు పూర్తి

తెలుగుదేశం హయాంలోనే పలమనేరు, నగరి, కుప్పంలో క్రీడా వికాస కేంద్రాలు పూర్తయ్యాయి. రామకుప్పం, వి.కోటలో మధ్యలో ఉండగానే వైకాపా అధికారంలోకి వచ్చింది. దీంతో ఈ రెండింటికీ ఐదేళ్లపాటు గ్రహణం పట్టుకుంది. పుంగనూరు, చిత్తూరు, పూతలపట్టు, గంగాధరనెల్లూరులో మినీ స్టేడియాలకు ఒక స్థలాన్ని ఎంపిక చేసినా ఆ తర్వాత వేర్వేరు కారణాలతో వెనక్కు తగ్గారు. గత ఐదేళ్లు జగన్ సర్కార్ వీటి గురించి కనీస ఆలోచన చేయలేదు.

రామకుప్పం, వి.కోటపై తొలుత దృష్టి

ఎన్డీయే అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ పనులపై దృష్టి పెట్టారు. తొలుత మధ్యలోనే నిలిచిన రామకుప్పం, వి.కోట కేంద్రాలను పూర్తి చేయాలనే తలంపుతో ఉంది. ఇందుకు అవసరమైన నిధులు త్వరలో విడుదల కానున్నాయి. వీటిని క్రీడాకారులకు అందుబాటులోకి తీసుకువచ్చిన తర్వాత మిగతాచోట్ల భూకేటాయింపులు చేయాలని భావిస్తున్నారు.



వి.కోటలో అసంపూర్తిగా నిలిచిన క్రీడా వికాస కేంద్రం

నేడు పింఛన్ల పంపిణీ

నాయకులు పాల్గొనాలని తెదేపా పిలుపు

చిత్తూరు (జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే: నేడు పింఛన్లు పంపిణీ చేయనున్నారు. అక్టోబరుకు గాను జిల్లాలో 2,69,677 మందికి రూ.113.77 కోట్ల నిధులు ప్రభుత్వం విడుదల చేసింది. ఈ మొత్తాన్ని సోమవారం ఆయా బ్యాంకుల నుంచి డ్రా చేసి సచివాలయ సిబ్బందికి అందజేశారు. మంగళవారం ఉదయం 6 గంటల నుంచి లబ్ధిదారులకు వారి ఇంటి వద్దే పింఛన్లు అందజేస్తారు. నేడు తీసుకోని వారికి రేపు 2వ తేదీ గాంధీ జయంతి సెలవు కావడంతో 3వ తేదీన పంపిణీ చేస్తారు. పింఛన్ల పంపిణీలో సిబ్బందితో పాటు నాయకులందరూ పాల్గొనాలని తెదేపా కేంద్ర కార్యాలయం పిలుపునిచ్చింది. ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షులు, ఇన్‌ఛార్జులు, మండల, నగర పార్టీ అధ్యక్షులు, డివిజన్, వార్డు అధ్యక్షులు, క్లస్టర్, యూనిట్, బూత్, సెక్షన్ ఇన్‌ఛార్జులు, పరిశీలకులు, కూటమి పార్టీల్లోని నాయకులు, ప్రజా ప్రతినిధులు సచివాలయ పరిధిలో ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేయాలని, చిత్రాలు సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేయాలని తెదేపా సూచించింది.

సర్వదర్శనానికి 18 గంటలు

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి సర్వదర్శనానికి ఎస్ఎస్‌డీ టోకెన్లు లేకుండా సోమవారం సాయంత్రానికి క్యూలైన్లలో వచ్చిన భక్తులు వైకుంఠం క్యూకాంప్లెక్స్-2లోని కంపార్ట్‌మెంట్లు, నారాయణగిరి షెడ్లు నిండిపోయి ఏటీసీ వరకు క్యూలైన్‌లో వేచిఉన్నారు. వీరికి దాదాపు 18 గంటల్లో శ్రీవారి దర్శనం లభించనుందని తితిదే తెలిపింది. రూ.300 ప్రత్యేక ప్రవేశదర్శనం టికెట్లు కలిగిన భక్తులు వైకుంఠం క్యూకాంప్లెక్స్-1లోని నాలుగు కంపార్ట్‌మెంట్లలో వేచిఉన్నారు. వీరికి రెండు గంటల్లో శ్రీవారి దర్శనం లభించనుంది. ఆదివారం శ్రీవారిని 84,066 మంది భక్తులు దర్శించుకున్నారు. రూ.4.02 కోట్ల హుండీ కానుకలు లభించాయి.

సర్పంచి చెక్ పవర్ రద్దు

చిత్తూరు (జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే: వెదురుకుప్పం మండలం, బొమ్మయ్యపల్లి సర్పంచి సి.గోవిందయ్య చెక్ పవర్ రద్దు చేస్తూ జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. పంచాయతీ నిధులు దుర్వినియోగం చేసినట్లు ఆ పంచాయతీకి చెందిన దేవళంపేట వార్డు సభ్యుడు ఎం.పయని డీపీవో, కలెక్టర్‌కు ఇటీవల ఫిర్యాదు చేశారు. దీనిపై సంబంధిత సర్పంచికి సంజాయిషీ నోటీసు జారీ చేసి, విచారణ చేపట్టారు. 2021-22, 2023-24 మధ్య పంచాయతీ నిధులు రూ.13.53 లక్షలు డ్రా చేయగా, అందులో రూ.2.91 లక్షలకు సరైన లెక్కలు లేవని, అలాగే 15వ ఆర్థిక సంఘం నిధులకూ సరైన లెక్కలు లేనందున ఆ సర్పంచి చెక్ పవర్ రద్దు చేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ప్రజలకు ధ్రువపత్రాలు జారీచేయాలి

చిత్తూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలోని 588 ఎస్టీ హ్యాబిటేషన్లలో ఇంకా జనన ధ్రువపత్రాలు, ఆధార్ తీసుకోనివారికి తక్షణమే జారీచేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి సోమవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. 'ప్రభుత్వ పథకాలు పొందేందుకు ఆధార్ కీలకం. ఎస్టీ ప్రాంతాల్లో అక్టోబరు 10లోగా సర్వేచేసి, అక్టోబరు 25లోగా జనన ధ్రువపత్రాలు ఇవ్వాలి. నవంబర్ 15 లోగా ఆధార్ కార్డుకు అప్‌లోడ్ చేయాలి. వీటి కోసం సంచార ఆధార్ కేంద్రాల ఏర్పాటుకు తహసీల్దార్లు చర్యలు చేపట్టాలి. జనన, మరణ ధ్రువపత్రాల మంజూరులో నోటరీ అవసరం లేదు. సెల్ఫ్ డిక్లరేషన్ తీసుకుని పరిశీలించాలి. భూరికార్డుల్ని డిజిటలైజేషన్ చేయాలని' పేర్కొన్నారు. జేసీ విద్యాధరి, శిక్షణ కలెక్టర్ హిమవంశీ, గిరిజన సంక్షేమ అధికారి మూర్తి పాల్గొన్నారు. గ్రామీణ పారిశ్రామిక పార్కుల ఏర్పాటు ద్వారా యువత, మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కలెక్టర్ పేర్కొన్నారు. పార్కుల ఏర్పాటుకు రాష్ట్రంలో ఎంపిక చేసిన మూడు జిల్లాల్లో చిత్తూరు సైతం ఉందన్నారు.

రహదారి మారినా.. ప్రమాదాలు ఆగక

ఆ మలుపులో మృత్యుఘోష

పలమనేరు, న్యూస్‌టుడే: ప్రస్తుతం జిల్లాలో అత్యంత ప్రమాదకరమైన రోడ్డుగా మొగిలి ఘాట్ రికార్డులకెక్కుతోంది. 2019లో ఈ రోడ్డును నాలుగు లైన్లుగా ప్రభుత్వం అభివృద్ధి చేసింది. నాడు డబుల్ రోడ్డుగా ఉన్న సమయంలో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరిగేవి. వాటిని నివారించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం చెన్నై నుంచి బెంగళూరు వరకు రోడ్డును విస్తరించి అభివృద్ధి చేసింది. రహదారిని విస్తరించినా ప్రమాదాలు మాత్రం తగ్గలేదు. 15 రోజుల వ్యవధిలో మూడు ఘోర ప్రమాదాలు సంభవించాయి. 12 మంది మృత్యువాత పడగా 40 మంది గాయపడ్డారు. మూడు ప్రమాదాలు మొగిలి ఘాట్ మలుపు వద్దే చోటు చేసుకోవడం గమనార్హం. రహదారి భద్రత అనలిస్టు బాలాజీ ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారులు ఇటీవల ప్రమాదాలపై సర్వే నిర్వహించారు. నివారణ కోసం మరో 10 రోజుల్లో తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.



మొగిలి ఘాట్ రోడ్డు మలుపు (పాత చిత్రం)

మారని మలుపు

సాధారణంగా నాలుగు లైన్ల రోడ్ల విస్తరణలో భాగంగా అధికారులు, సంబంధిత రహదారుల ఇంజినీర్లు అత్యంత ప్రమాదకరంగా ఉన్న మలుపులను తగ్గించడానికి యత్నిస్తారు. మలుపులు, పల్లంలేని రోడ్డును నిర్మించి అప్పటి వరకు చోటు చేసుకున్న ప్రమాదాలను పరిగణనలోకి తీసుకుని నివారించడానికి చర్యలు తీసుకుంటారు. మొగిలి ఘాట్ రోడ్డు 1916లో ఎలా ఉందో.. రహదారి విస్తరణ చేపట్టినా అందులో ఎలాంటి మార్పు లేదు. రెండు వరుసల రహదారి నాలుగు వరుసలుగా మాత్రమే మారింది. ఈ విషయాన్ని ఇటీవల సర్వే చేసిన అనలిస్టు బాలాజీ వెలిబుచ్చారు. ప్రస్తుతం ఈ మలుపు అత్యంత ప్రమాదకరంగా మారింది. నిత్యం ఏదో ఒక సమయంలో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఇక ఈ మలుపును తగ్గించడం ఏమాత్రం వీలుకాదని అధికారులు అంటున్నారు. వాహన చోదకులను అప్రమత్తం చేసే విధంగా రోడ్డుపై ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడానికి అధికారులు కసరత్తు చేస్తున్నారు.



ప్రస్తుతం మొగిలి ఘాట్ రోడ్డు ఇలా..

దయ చూపండి.. పరిష్కరించండి

కలెక్టరేట్‌లో అధికారులకు విన్నవించిన ప్రజలు

క్షేత్ర స్థాయిలో సమస్యలు పరిష్కారం కావడం లేదు. కాళ్లరిగేలా తిరుగుతున్నా పట్టించుకోవట్లేదు. తమ బాధల్ని ఆలకించి దయతో పరిష్కారం చూపాలని అర్జీదారులు జిల్లా ఉన్నతాధికారులకు విన్నవించుకున్నారు. సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో తమ సమస్యలపై మొరపెట్టుకున్నారు.
- న్యూస్‌టుడే, చిత్తూరు కలెక్టరేట్

22ఏ జాబితా నుంచి తొలగించాలి




నాకు కొంత భూమి ఉంది. ఈ భూమికి సంబంధించి రిజిస్ట్రేషన్ పత్రాలు న్నాయి. ప్రస్తుతం ఆ భూమి 22ఏ జాబితాలో నమోదైనట్లు మండల అధికారులు చెబుతున్నారు. నాకు వేరే ఆధారం లేదు. మండల స్థాయి అధికారులకు విన్నవించినా స్పందన లేదు. అధికారులు స్పందించి జాబితా నుంచి తొలగించాలి. - శరవణ, గుండ్లసాగరం, గుడుపల్లె మండలం

పాసుపుస్తకానికి తిరుగుతున్నా



మా అనుభవంలో కొంత వ్యవసాయ భూమి ఉంది. అది తప్ప వేరే ఆధారం లేదు. ఈ భూమికి పట్టా మంజూరు చేయాలని ఎన్నో ఏళ్లుగా కాళ్లరిగేలా తిరుగుతున్నా. ఎవరూ పట్టించుకోవడం లేదు. జిల్లా అధికారులు స్పందించి పట్టా ఇప్పించాలి. - మునెమ్మ, టీ.ఎం.పాళ్యం, పుంగనూరు మండలం

పింఛను నిలిపివేశారు



గతంలో దివ్యాంగుల సామాజిక భద్రత పింఛను ఇచ్చారు. కొన్ని నెలల క్రితం రద్దు చేశారు. సాయం అందక చాలా కష్టంగా ఉంది. అనారోగ్య సమస్యలతో ఇబ్బందిగా మారింది. మందులు కొనుగోలు చేయడానికి అవస్థలు పడుతున్నా.
- బిచ్చయ్య, ఎస్ఆర్‌పురం మండలం

పనులు చేయనీయకుండా అడ్డుపడ్డారు



గత ప్రభుత్వం ఇంటి నిర్మాణానికి 1.50 సెంట్ల భూమి కేటాయించింది. ఆర్థిక ఇబ్బందులతో పనులు చేపట్టలేకపోయా. కొన్ని రోజుల క్రితం స్థలం వద్దకు వెళ్లా. ఈ భూమిని తనదంటూ ఓ వ్యక్తి అడ్డుపడుతున్నారు. మా కుటుంబానికి ఈ స్థలం తప్ప వేరే ఆధారం లేదు. అధికారులు విచారించి స్థలాన్ని అప్పగించాలి. - అమ్ము, బ్రాహ్మణపల్లె, వెదురుకుప్పం మండలం

రైతేరాజు 6లో

దసరాకు కందిపప్పు

చిత్తూరు (మిట్టూరు): దసరా పండగకు పేదింట కందిపప్పు ఉడకబోతోంది. పేద, మధ్య తరగతి కుటుంబాలకు ఆర్థిక ఉపశమనం కలిగించేలా ప్రభుత్వం బియ్యం కార్డుదారులకు కిలో చొప్పున కందిపప్పు అందించనుంది. జిల్లాలోని 1379 చౌక దుకాణాల ద్వారా 5.43 లక్షల కార్డుదారులకు ఈ నెల 1 నుంచి కందిపప్పు పంపిణీ చేయనున్నారు. వీటితో పాటు బియ్యం, చక్కెర అందించనున్నారు.

గత ప్రభుత్వంలో బకాయిలు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కందిపప్పు సరఫరాపై దృష్టి సారించింది. గత ప్రభుత్వం పంపిణీదారులకు రూ.కోట్ల బకాయిలు పెట్టి వెళ్లడంతో ఇబ్బందులు ఏర్పడ్డాయి. ప్రస్తుతం అక్టోబరుకు తొలివిడతగా 310 టన్నులు కేటాయించింది. త్వరలో చౌక దుకాణాలకు సరఫరా చేస్తామని అధికారులు పేర్కొన్నారు.



బాలిక తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఎస్పీ మణికంఠ చందోలు

తెలిసిన వారి పనేనా?

- బాలిక అదృశ్యం కేసులో అనుమానాలు
- రంగంలోకి 11 బృందాలు
- త్వరలో ఛేదిస్తాం: ఎస్పీ

పుంగనూరు గ్రామీణ, న్యూస్‌టుడే: పుంగనూరు పట్టణానికి చెందిన బాలిక అదృశ్యం వెనుక తెలిసిన వారి హస్తం ఉన్నట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. ఈ నెల 29న సాయంత్రం ఏడు గంటల వరకు చుట్టు పక్కల పిల్లలతో ఆడుకున్న చిన్నారి అస్పియా అంజుమ్ అదృశ్యం కావడంపై పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్పీ మణికంఠ చందోలు తెలిపారు. సోమవారం ఆయన పట్టణంలోని ఉబేదుల్లా కాంపౌండ్‌లోని చుట్టుపక్కల వీధులను పరిశీలించారు. ఈ సందర్భంగా మీడియాలో మాట్లాడుతూ.. ఫైనాన్స్ వ్యాపారం చేస్తున్న అంజోద్ కుమార్తె అస్పియా అంజుమ్(7) ఆదివారం ట్యూషన్‌కు వెళ్లి వచ్చింది. ఇంటి వద్ద ఆడుకుంటూ 7 గంటల ప్రాంతంలో బాలిక కనబడకపోవడంతో చుట్టు పక్కల, బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ దొరకలేదు. దీంతో చిన్నారి అదృశ్యమైనట్లు గుర్తించి రాత్రి గంటలకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు అందిన వెంటనే సీఐ శ్రీనివాసులు, పోలీసులు, యువకులు రాత్రంతా అన్ని ప్రాంతాల్లో బాలిక కోసం వెతికారు. 11 బృందాలు రంగంలోకి దిగి అన్ని కోణాల్లో గాలిస్తున్నట్లు చెప్పారు. డాగ్ స్క్వాడ్ పసిగట్టిన ప్రదేశాలను పరిశీలించామన్నారు. సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నామని తెలిపారు. ఆర్థిక లావాదేవీలతో సహా అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు. త్వరలో బాలిక ఆచూకీ కనుగొంటామని ఎస్పీ చెప్పారు.



జాగిలంతో పరిశీలిస్తున్న పోలీసులు



డ్రాగన్ పండు ఆదాయం మెండు

పుంగనూరు, కల్లూరు, న్యూస్‌టుడే: వ్యవసాయ రంగంలో పెనుమార్పులు చోటు చేసుకుంటున్నాయి. పాత పద్ధతిలో సంప్రదాయ పంటలు సాగుచేసి నష్టాలు చవిచూస్తున్నారు. మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలు సాగు చేస్తూ లాభాలు పొందుతున్నారు. చిత్తూరు జిల్లాలోనూ వియత్నం, థాయ్‌లాండ్, శ్రీలంక దేశాల్లో పండించే డ్రాగన్ ఫ్రూట్‌ను సాగుచేసి ఆదర్శంగా నిలుస్తున్నారు. పులిచెర్ల మండలం అయ్యావాండ్లపల్లె పంచాయతీ ఎర్రంవాండ్లపల్లెకు చెందిన యువరైతు చంద్రశేఖర్ మూడు ఎకరాల్లో డ్రాగన్ సాగు చేస్తున్నారు. సోమల మండలం దాసిరివారిపల్లెలో రైతు సాంప్రదాయ పంటలకు స్వస్తి పలికి మూడెకరాల్లో సాగుకు శ్రీకారం చుట్టారు.

సస్యరక్షణపై దృష్టి సారించాలి

తోటలో దిగుబడులు మొదలైనా సస్యరక్షణపై మరింత దృష్టి సారించాలి. సస్యరక్షణ చర్యలు తీసుకుంటే 20ఏళ్ల వరకు దిగుబడులు వస్తూనే ఉంటాయి. మొదటి ఏడాది రెండు టన్నుల నుంచి నాలుగో ఏడాదిలో 4.5టన్నుల దిగుబడులు పెరుగుతూ వస్తున్నాయి. ఒక్కో కాయ 350 నుంచి 500గ్రాముల వరకు ఉంటోంది. బెంగళూరు, చెన్నై, తిరుపతిలలో విక్రయిస్తున్నాం. కొన్నిసార్లు తోట దగ్గరకే వచ్చి కొనుగోలు చేస్తున్నారు. మరో ఎకరాలో నాటాలని ప్రయత్నిస్తున్నారు.

అధిక ఆదాయం



నాకున్న మూడెకరాల్లో డ్రాగన్ పండు సాగు చేస్తున్నా. ఎకరాకు 4000 మొక్కలు నాటాను. రూ. 8లక్షలు పెట్టుబడి అయింది. గుంటూరు కర్నూలు ఆగ్రో ఫామ్ నుంచి రవాణా ఖర్చులతో కలిపి మొక్క రూ.65 లతో 4000 మొక్కలు కొనుగోలు చేశాను. మొక్కలకు రూ.2.60లక్షలు అయింది. పదికి పది అడుగుల దూరంలో రాతి కూసాలు నాటి సాగు చేశాను. సూక్ష్మసేద్యం ద్వారా పంటకు నీరు అందించాను. ఎకరాకు 8 టన్నుల దిగుబడి రాగా, తిరుపతి, పీలేరు తదితర ప్రాంతాల్లో కిలో రూ. 120 నుంచి 150 వరకు విక్రయించాను. ఇప్పటి వరకు రూ.8లక్షలు వచ్చింది. మూడో సంవత్సరం మంచి లాభాలు ఆర్జించవచ్చు.

- చంద్రశేఖర్, యువరైతు, ఎర్రంవాండ్లపల్లె

ప్రశ్న జవాబు

రేణిగుంట, న్యూస్‌టుడే: వ్యవసాయంలో రైతులు ఎదుర్కొంటున్న ప్రశ్నలకు సమాధానాలు చెప్పిన మండల వ్యవసాయాధికారి సునీల్‌కుమార్.

ప్రశ్న: రబీ సీజన్‌లో వరి విత్తనం నాటే ముందు విత్తనశుద్ధి ఏ మందుతో ఎలా చేసుకోవాలి? **- మల్లికార్జున, ఆర్.మల్లవరం, రేణిగుంట మండలం**

జవాబు: రబీ సీజన్‌లో విత్తనాన్ని సేకరించిన తరువాత మొదట 24 గంటలు దాన్ని నానబెట్టాలి. తాలు గింజలను ఏరివేయాలి. ఒక కిలో విత్తనానికి ఒక గ్రాము కార్బండిజమ్ మంకోజెబ్ సిలిండ్రియన్‌ను కలుపుకొని మంచి విత్తనంలో వేయాలి. 24 గంటలు విత్తనాన్ని మండెకట్టిన తరువాత పొలంలో చల్లుకుంటే 15 నుంచి 20 రోజుల వరకు ఎటువంటి తెగుళ్లు రాకుండా మొక్క ఆరోగ్యంగా పెరుగుతుంది.

రైతేరాజు

వంగ ఇలా చేస్తే ఉండదిక బెంగ

పుత్తూరు, న్యూస్‌టుడే: చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో రైతులు వంగ పంట విస్తారంగా సాగు చేశారు. వివిధ రకాల తెగుళ్లు, పురుగులు ఆశించి పైరు ఎదుగుదల, దిగుబడిని దెబ్బతీస్తున్నాయి. వీటి నివారణకు పుత్తూరు ఉద్యానశాఖాధికారి వెంకటసౌజన్య పలు సూచనలు చేశారు.

అధిక దిగుబడులు పొందాలంటే..

మేలు సంకర జాతి రకాలను ఎంచుకోవాలి. పురుగు ఆశించిన కాయలను, కొమ్మలను తుంచి నాశనం చేయాలి. అంతర పంటగా బంతి, ఉల్లి, వెల్లులి పంటలు సాగు చేసుకుంటే మంచిది. లింగాకర్షక బుట్టలను ఎకరాకు నాలుగు చొప్పున ఏర్పాటు చేయాలి. తలనత్త పురుగులు ఆశించిన ప్రాంతం నుంచి ఒక అంగుళం కిందకు తుంచి నాశనం చేయాలి. ట్రైకోగ్రామా బదనికలను ఎకరాకు 20వేలు విడుదల చేయాలి. బీటీ మందులను లీటరు నీటికి గ్రాము చొప్పున కలిపి పూత దశలో పిచికారీ చేయాలి. ఎకరాకు 200 కిలోల చొప్పున వేపపిండిని దుక్కిలో వేయాలి. బ్యాక్టీరియా ఎండు తెగులు ఉన్న ప్రాంతాల్లో ఎకరాకు 6 కిలోల చొప్పున బ్లీచింగ్ పొడి మందును వేసుకోవాలి. వంగ పెరుగుదల దశలో 1-2 శాతం యూరియా ద్రావణం(లీటరు నీటికి 10-20 గ్రాములు) పిచికారీ చేస్తే అధిక పంట దిగుబడితో పాటు 20శాతం నత్రజని ఆదా అవుతుంది. పూత, కోత దశలలో 24-డి(లీటరు నీటికి 10 మి.గ్రా, లేదా ప్లానోఫిక్స్ 2.5మి.లీ/ 10 లీటర్ల నీటికి కలిపి 10 రోజుల వ్యవధిలో రెండు సార్లు మంచి దిగుబడి పొందవచ్చు.




జాగ్రత్తలు పాటిస్తే ప్రాణనష్టం దూరం

వర్షాకాలంలో మూగజీవాల సంరక్షణలో అలక్ష్యం చేయకుండా సంరక్షించుకోవడం పశుపోషకుల ముఖ్య కర్తవ్యమని శ్రీకాళహస్తి వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుడు డాక్టర్ ఎన్.వి.శ్రీకాంత్‌బాబు తెలిపారు. వరదలు, తుపాన్లు సంభవించినప్పుడు పశుపోషకులు ఈ తరహా జాగ్రత్తలు పాటిస్తే ప్రాణనష్టం, వ్యాధుల బారిన పడకుండా సంరక్షించుకోవచ్చునని తెలిపారు.

- పశువులకు ఇచ్చే నీటిని బ్లీచింగ్ పౌడర్‌తో శుభ్ర పరచాలి.
- పశువుల పాకలను తేలిక పాటి ఆకులు, కొబ్బరి మట్టలు తదితర వాటితో వేసుకుంటే గాలి తీవ్రతకు అవి కూలిపోయినా పెద్దగా నష్టం ఉండదు.
- బాహ్య పరాన్నజీవుల నిర్మూలనకు క్రిమి సంహారక మందులు విధిగా వాడాలి.
- నిల్వ ఉన్న నీటిలో దోమలు, ఈగలు పెరిగే ప్రమాదముంది. తద్వారా వ్యాధులు వ్యాపించే అవకాశం ఎక్కువ. అలాంటి పరిస్థితులు లేకుండా జాగ్రత్త పడాలి. వీలైనంత వరకు పశువులు ఉన్న ప్రదేశంలో నీటి నిల్వలు లేకుండా శ్రద్ధ చూపాలి.
- రోగ నిరోధక శక్తి తగ్గి పశువులు వ్యాధులకు గురయ్యే అవకాశముంది. పశువుల్లో వచ్చే అనారోగ్య సమస్యలను గుర్తించి అప్పటికప్పుడు వైద్య సాయం అందించాల్సి ఉంది.
- సీజనల్ వ్యాధుల నివారణకు విధిగా టీకాలు వేయించాలి.
- ప్రధానంగా దాణా ఇబ్బందులు లేకుండా వర్షాకాలంలో ముందస్తుగా దాచుకోవడం శ్రేయస్కరం.


- న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి



చంద్రబాబుకు చెక్కు అందజేస్తున్న తేజోమూర్తి, పక్కన ఎమ్మెల్యే మురళీమోహన్

సీఎం సహాయనిధికి రూ.10 లక్షల విరాళం

చిత్తూరు విద్య, న్యూస్‌టుడే: విజయవాడ వరద బాధితులకు విజయం విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ తేజోమూర్తి సీఎం చంద్రబాబుకు విజయవాడలో సోమవారం రూ.10,00,116 చెక్కు అందజేశారు. అనంతరం కాణిపాకం బ్రహ్మోత్సవాలు ముగిసిన తర్వాత గణనాథుని ఆలయంలో నిర్వహించిన 21 కేజీల లడ్డూ ప్రసాదం దక్కించుకున్నారు. ఆ ప్రసాదాన్ని సీఎంకు ఇచ్చారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మురళీమోహన్, విజయం విద్యాసంస్థల ఈడీ శైలజమూర్తి, ఏవో రాజగోపాల్, లైజన్ ఆఫీసర్ రమేష్ బాబు పాల్గొన్నారు.



శ్రీపరశురామేశ్వరస్వామి ఆలయాన్ని దర్శించుకుని వస్తున్న పర్యాటకశాఖ అధికారులు

నేటి నుంచి గుడిమల్లంకు పర్యాటక బస్సులు

ఏర్పేడు, న్యూస్‌టుడే: ఏర్పేడు మండలం గుడిమల్లంలో వెలసిన శ్రీపరశురామేశ్వర స్వామి ఆలయానికి పర్యాటక బస్సులు నడపనున్నట్లు పర్యాటక శాఖ డివిజనల్ మేనేజరు గిరిధర్ తెలిపారు. దీనిపై ఆలయ అధికారులు ఇటీవల ఉన్నతాధికారులకు విన్నవించడంతో సోమవారం పర్యాటకశాఖ బృందం ఆలయాన్ని పరిశీలించి ఆమోదం తెలిపారు. మంగళవారం నుంచి రోజూ తిరుపతిలోని శ్రీనివాసం నుంచి బయలుదేరే పర్యాటక బస్సులు గుడిమల్లం మీదుగా శ్రీకాళహస్తికి వెళ్లేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు పర్యాటకశాఖ బృందానికి దర్శన ఏర్పాట్లు చేసి వేదపండితుల మంత్రోచ్చారణతో సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ గిరినాయుడు, ప్రవీణ్, రాజశేఖర్‌నాయుడు, పద్మనాభంనాయుడు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర పోటీల్లో విజేతలు వీరే



జిల్లా స్థాయి వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

చిత్తూరు విద్య, న్యూస్‌టుడే: స్వర్ణాంధ్ర-2047 విజన్ జిల్లా స్థాయి పోటీలు స్థానిక పీసీఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించి విజేతలను ప్రకటించినట్లు డీఈవో చంద్రశేఖర్ తెలిపారు. పోటీల్లో వ్యాసరచనలో హిమశ్రీ (జడ్పీ హైస్కూల్ మంగళపల్లె, బంగారుపాళ్యం), పవిత్ర (జడ్పీ హైస్కూల్ ఏకాంబరకుప్పం, నగరి), మదిహసన్ (జడ్పీ హైస్కూల్ కల్లూరు, పులిచెర్ల) వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించారు. వక్తృత్వ పోటీలో సాయిప్రియ (కేజీబీవీ, రొంపిచెర్ల), అభినయ (జడ్పీ హైస్కూల్ టీఆర్ పురం, పాలసముద్రం), హేమ (జడ్పీ హైస్కూల్ మంగళపల్లె, బంగారుపాళ్యం) వరుసగా మొదటి, రెండు, మూడో స్థానాల్లో నిలిచారు. డిబేట్‌లో ప్రథమ బహుమతి పునీత్‌సాయి (జడ్పీ హైస్కూల్ మంగళపల్లె, బంగారుపాళ్యం), సాయిశ్రీ (ప్రభుత్వ ఉన్నత పాఠశాల, బంగారుపాళ్యం), ద్వితీయ బహుమతి రోహిత్ (జడ్పీ హైస్కూల్ ఎం.పైపల్లె, ఐరాల), సుచిత (ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఐరాల), తృతీయ బహుమతి ఉమామహేశ్వరి, హారిక (జడ్పీ హైస్కూల్ కార్వేటినగరం) సాధించారు.


పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్‌కు 45 ఫిర్యాదులు



బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ మణికంఠ

చిత్తూరు (నేరవార్తలు), న్యూస్‌టుడే: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం జరిగిన పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్‌కు 45 ఫిర్యాదులు అందాయి. ఎస్పీ మణికంఠ ఫిర్యాదులు స్వీకరించి మాట్లాడారు. ప్రజల్లో పోలీసులపై నమ్మకం వచ్చేలా విధులు నిర్వహించాలన్నారు. కుటుంబ సమస్యలు 10, ఇంటి గొడవలు 1, వేధింపులు 3, నగదు సమస్యలు 8, భూ సమస్యలు 10 ఆస్తి తగాదాలు 11, దారి సమస్యలు 2 చొప్పున మొత్తం 45 ఫిర్యాదులు ఉన్నాయి. చిత్తూరు డీఎస్పీ సాయినాథ్ పాల్గొన్నారు.✶ పెనుమూరు పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ గత నెల 19న అనారోగ్యంతో మృతి చెందిన ఏఎస్సై యు.సూరిబాబు భార్య సుజాతకు ఐడీఆర్‌ఎఫ్ నిధుల నుంచి రూ.లక్ష చెక్కు, గత నెల24న ప్రమాదంలో గాయపడ్డ ఏఆర్ కానిస్టేబుల్ ఓంప్రకాష్ సోదరుడికి ఐడీఆర్‌ఎఫ్ నిధుల నుంచి రూ.30 వేలు చెక్కులను ఎస్పీ అందించారు.

చేనేత రంగ అభివృద్ధికి కృషి



గంజి మాధవయ్యను సన్మానిస్తున్న జిల్లా చేనేత కార్మిక యూనియన్ నాయకులు

పుత్తూరు, న్యూస్‌టుడే: చేనేత రంగం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్య పేర్కొన్నారు. పుత్తూరులో ఆయన్ను ఉమ్మడి చిత్తూరు జిల్లా చేనేత కార్మిక యూనియన్ నాయకులు సోమవారం కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తిరుపతి, చిత్తూరు జిల్లాల్లోని చేనేత కార్మికుల, సంక్షేమానికి, వృత్తి సంరక్షణకు తొలి సమావేశంలోనే విధులు, నిధులు గురించి తెలుసుకుని చేనేతకు సహకారం అందిస్తానన్నారు. కార్మిక యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆకుల వాసు, గౌరవాధ్యక్షుడు కేవీ కుప్పయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షణ్ముగవర్మ పాల్గొన్నారు.

పూర్ణాహుతితో ముగిసిన పవిత్రోత్సవాలు



హోమాలు నిర్వహిస్తున్న అర్చకులు

వడమాలపేట, న్యూస్‌టుడే: అప్పలాయగుంట ప్రసన్న ఆలయంలో మూడురోజులు పాటు జరిగిన పవిత్రోత్సవాలు సోమవారం మహా పూర్ణాహుతితో ముగిశాయి. ఉదయం స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసి విశేషంగా అలంకరించారు. అనంతరం అర్చకులు యాగశాల నందు హోమం నిర్వహించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకన్నకు స్నపన తిరుమంజనం చేపట్టారు. ఆలయాధికారి శివకుమార్, అర్చకులు సూర్యకుమారాచార్యులు పాల్గొన్నారు.



ఆడియో ఆవిష్కరణలో యూనిట్ సభ్యులు

శిఖండి చిత్రం పర్యావరణ ప్రేమికులకు అంకితం

చిత్తూరు(సంతపేట), న్యూస్‌టుడే: పర్యావరణ విశిష్టత తెలియజేసేలా రూపొందించిన 'శిఖండి' చిత్రాన్ని పర్యావరణ ప్రేమికులకు అంకితమిస్తున్నట్లు చిత్ర కథానాయకుడు, దర్శకుడు కోడి కిషోర్ తెలిపారు. చిత్ర ఆడియో విడుదల ఫంక్షన్ చిత్తూరు నాగయ్య కళాక్షేత్రంలో ఆదివారం రాత్రి నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ దుష్ప్రభావాల్ని తెలియజేసేలా, భావితరాల్ని ఆలోచింపజేసే సామాజిక ఇతివృత్తంతో చిత్రాన్ని నిర్మించామన్నారు. చిత్తూరుకు చెందిన నటీనటులతో ఈ ప్రాంత పరిసరాల్లోనే షూటింగ్ జరిపామన్నారు. త్వరలోనే విడుదల తేదీని ప్రకటిస్తామన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు గొల్లపల్లి విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

పుత్తూరు, న్యూస్‌టుడే: గొల్లపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలకి చెందిన 8 మంది రాష్ట్ర స్థాయి నెట్‌బాల్, హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం భారతి తెలిపారు. సోమవారం వారిని అభినందించారు. అండర్-17 జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నెట్‌బాల్ బాలుర విభాగంలో మునిమోహిత్, చరణ్‌తేజ, ధనుసు, బాలికల విభాగంలో చంద్రకళ, జనవి, సంధ్య, శృతి, హ్యాండ్‌బాల్ అండర్-17 బాలికల విభాగంలో హేమనందిని ఎంపికైనట్లు తెలిపారు. త్వరలో రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొంటారని పీడీ గోపీకృష్ణ తెలిపారు.

ముగిసిన రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలు



బాలుర విజేత వైజాగ్ జట్టుకు బహుమతి అందజేస్తున్న ఎమ్మెల్యే జీవీ, మక్కెన

వినుకొండ రూరల్, న్యూస్‌టుడే: పల్నాడు జిల్లా వినుకొండ లయోలా పాఠశాలలో నిర్వహించిన 68వ రాష్ట్రస్థాయి అండర్- 17 స్కూల్ గేమ్స్ బాల, బాలికల ఫుట్‌బాల్ పోటీలు నువ్వా నేనా అనే రీతిలో సాగాయి. శని, ఆదివారాల్లో మొత్తం 13 జిల్లాల నుంచి 26 బాల, బాలికల జట్లకు పోటీలు నిర్వహించారు. సోమవారం క్వార్టర్ ఫైనల్స్‌లో బాలుర విభాగంలో చిత్తూరుపై వైజాగ్ జట్టు గెలుపొందింది. కడపపై గుంటూరు, ప్రకాశంపై తూర్పు గోదావరి, కృష్ణాపై అనంతపురం జట్లు విజయం సాధించాయి. సెమీ ఫైనల్స్‌లో గుంటూరుపై వైజాగ్, తూర్పు గోదావరిపై అనంతపురం గెలిచి ఫైనల్స్‌కు చేరాయి. ఈ పోటీల్లో వైజాగ్ విజేతగా నిలిచింది. అనంతపురం ద్వితీయ స్థానంలో నిలవగా గుంటూరు మూడో స్థానంలో నిలిచింది.❖ బాలికల విభాగంలో కర్నూలుపై కడప, కృష్ణాపై చిత్తూరు, వైజాగ్‌పై అనంతపురం, పశ్చిమ గోదావరిపై గుంటూరు జట్లు గెలుపొందాయి. సెమీ ఫైనల్స్‌లో చిత్తూరుపై కడప, గుంటూరుపై అనంతపురం గెలిచాయి. ఫైనల్లో అనంతపురంపై కడప విజయం సాధించి విజేతగా నిలిచింది. ద్వితీయ స్థానంలో అనంతపురం, చిత్తూరు తృతీయ స్థానంలో ఉన్నట్లు స్కూల్ గేమ్స్ జిల్లా కార్యదర్శి సురేష్‌కుమార్ తెలిపారు. బాలుర విభాగంలో బెస్ట్ ప్లేయర్‌గా అలీ (గుంటూరు), బెస్ట్ స్కోరర్‌గా భరత్ సాయి (వైజాగ్), బెస్ట్ గోల్ కీపర్‌గా విష్ణువర్ధన్ (చిత్తూరు) ఎంపికయ్యారు. బాలికల విభాగంలో ఉత్తమ క్రీడాకారిణిగా వర్ష (అనంతపురం), ఉత్తమ స్కోరర్‌గా మహీ (గుంటూరు), ఉత్తమ గోల్ కీపర్‌గా భువన (కడప) ఎంపికయ్యారు. విజేతలకు వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, జనసేన నేత నాగశ్రీను, హెచ్‌ఎం రవి తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు విద్య, న్యూస్‌టుడే: సమగ్రశిక్ష సహిత విద్యా విభాగం భవిత కేంద్రాల్లో ఐదు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వాటి భర్తీ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఏపీసీ వెంకటరమణారెడ్డి సోమవారం తెలిపారు. బంగారుపాళ్యం, చిత్తూరు, పలమనేరు, పూతలపట్టు, సోమలలో ఈ పోస్టులు ఉన్నాయని చెప్పారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయంలో బ్యాచిలర్ ఆఫ్ ఫిజియోథెరపీ డిగ్రీ ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులన్నారు. క్యాంప్‌నకు హాజరైన రోజున రూ. 1,050 చెల్లించనున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన వారు తమ దరఖాస్తులను సమగ్రశిక్ష జిల్లా కార్యాలయంలో ఈ నెల 5లోగా అందజేయాలని కోరారు.

వెంకాబ్ కోళ్ల ధరలు

బ్రాయిలర్ (రైతు ధర)	115
రిటైల్	137
లేయర్	115
బ్రాయిలర్స్	199
బ్రాయిలర్స్ స్కిన్ లెస్	226
లేయర్ మాంసం	195

అదనపు పోలింగ్ కేంద్రాలకు ప్రతిపాదనలు



రాజకీయ పార్టీల సభ్యులతో సమావేశమైన జేసీ విద్యాధరి

చిత్తూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో అదనపు పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామని జేసీ విద్యాధరి అన్నారు. పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణపై సోమవారం రాజకీయ పార్టీల సభ్యులతో జేసీ సమావేశమయ్యారు. 7 నియోజకవర్గాల్లో 15 నూతన పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, 14 పీఎస్‌ల లోకేషన్ మార్పు, 6 చిరునామా మార్పుపై ప్రతిపాదనలు తయారుచేశామని, దీనిపై అక్టోబరు 2లోగా అభిప్రాయాల్ని తెలియజేయవచ్చన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి కలెక్టరేట్‌లోని ఈవీఎం గోదామును డీఆర్వో పుల్లయ్య పరిశీలించారు.

ఎక్సైజ్ శాఖలో బదిలీల ప్రక్రియ పూర్తి

తాజాగా ఎస్‌ఐలకు స్థానచలనం

చిత్తూరు (నేరవార్తలు), న్యూస్‌టుడే: ఎక్సైజ్ శాఖలో బదిలీల ప్రక్రియ పూర్తైంది. మొదట డీసీ, ఏసీ, ఈఎస్‌లకు, తర్వాత సీఐలకు స్థానచలనం కలిగింది. సోమవారం ఎస్సైలు, కానిస్టేబుళ్లు, హెడ్‌కానిస్టేబుళ్ల బదిలీ జరిగాయి. దీంతో ఈ ప్రక్రియ పూర్తి చేసినట్లు సంబంధిత అధికారులు ప్రకటించారు. బదిలీ అయిన వారందరూ వెంటనే వారి, వారి స్థానాల్లో రిపోర్టు చేయాలని అధికారులు ఆదేశించారు.

జిల్లాలో బదిలీ అయిన ఎస్‌ఐల వివరాలు

ఎస్సైలు	ప్రస్తుతం	బదిలీ స్థానం
ఆర్.పృధ్వీరాజ్	పంచలింగ చెక్‌పోస్టు	చిత్తూరు అర్బన్
పి.శ్రావన్‌తేజ్	తిరుపతి డిస్టలరీస్	కార్వేటినగరం
ఎస్.మోసెస్	గూడూరు	కార్వేటినగరం
ఎ.వి.రమణరాజు	పుత్తూరు	చిత్తూరు రూరల్
ఎ.రామమూర్తి	పుత్తూరు	చిత్తూరు రూరల్
పి.వెంకటేశు	నగరి	ప్రొద్దుటూరు డిపో
ఎం.వేణుగోపాలరెడ్డి	శ్రీకాళహస్తి	పుంగనూరు
పి.భానుప్రకాష్	తనకల్లు	పలమనేరు
కె.మస్తాన్‌వలి	మడకశిర	పలమనేరు
టి.మహేంద్ర	తిరుపతి డిపో	కుప్పం
జి.మోహన్‌బాబు	బద్వేల్	కుప్పం
వి.సంధ్య	రాజంపేట	పులిచెర్ల
బి.మోహనకృష్ణ	నంద్యాల	చిత్తూరు అర్బన్
బి.వెంకటేశులు	చిత్తూరు డిపో-1	చిత్తూరు డిపో
జి.అశోక్‌కుమార్	తిరుపతి రూరల్	చిత్తూరు ఈఎస్‌టీఎఫ్
బి.రామదాసు	కడప ఈఎస్‌టీఎఫ్	క్యాటిల్‌ఫాం చెక్‌పోస్టు
పి.పృధ్వి	పుట్టపర్తి	చిత్తూరు ఏసీ కార్యాలయం ఎన్‌ఫోర్సుమెంట్
కె.సుబ్రహ్మణ్యం	ఎర్రగుంట్ల	చిత్తూరు ఏసీ కార్యాలయం ఎన్‌ఫోర్సుమెంట్

గురుకుల విద్యార్థినికి తీవ్ర అస్వస్థత

సకాలంలో చికిత్స అందక ప్రాణాపాయ స్థితిలోకి



వెంటిలేటర్‌పై సుస్మిత

చిత్తూరు (జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే: నగరంలోని స్థానిక అంబేడ్కర్ గురుకుల విద్యార్థిని తీవ్ర అస్వస్థతకు గురైంది. సకాలంలో చికిత్స అందించకపోవడంతో ప్రాణాపాయ స్థితిలోకి వెళ్లింది. బండపాకాలకు చెందిన సుస్మితకళ గురుకుల పాఠశాలలో 8వ తరగతి చదువుతోంది. ఐదు రోజుల క్రితం జ్వరం రావడంతో నిర్వాహకులు ఆ విద్యార్థిని చిత్తూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. అయినా కుదుటపడక పోవడంతో విషయం తెలుసుకున్న సుస్మిత కుటుంబ సభ్యులు ఆమెను ఇంటికి తీసుకెళ్లారు. ఫిట్స్ రావడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లింది. తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో వెంటిలేటర్ సాయంతో అక్కడి వైద్యులు చికిత్స అందించారు. పరిస్థితి విషమించడంతో సోమవారం తిరుపతి నుంచి తమిళనాడులోని వేలూరు సీయంసీ ఆసుపత్రికి తీసుకెళ్లారు. సకాలంలో సరైన చికిత్స అందించకపోవడంతోనే పరిస్థితి విషమించిందని, పాఠశాల నిర్వాహకుల నిర్లక్ష్యంతోనే ఇలా జరిగినట్లు సుస్మిత సమీప బంధువు కృష్ణమూర్తి ఆరోపించారు. గురుకుల పాఠశాలల జిల్లా సమన్వయకర్త పద్మజ 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ తమ నిర్లక్ష్యం లేదని, తాము సకాలంలో స్పందించి ఆసుపత్రికి తీసుకెళ్లినట్లు స్పష్టం చేశారు.

చెక్కు బౌన్స్ కేసులో.. మహిళకు ఆరు నెలల జైలు

చిత్తూరు(న్యాయవిభాగం), న్యూస్‌టుడే: చెల్లని చెక్కు ఇచ్చినందుకు ఓ మహిళకు ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ సోమవారం స్థానిక నాల్గో అదనపు కోర్టు న్యాయమూర్తి షేక్ బాబాజాన్ తీర్పు చెప్పారు. చిత్తూరు నగరం సాయినగర్‌కాలనీకి చెందిన చెరుకూరి పట్టాభినాయుడు వద్ద నుంచి 2014లో వ్యాపార నిమిత్తం స్థానిక బీవీరెడ్డికాలనీకి చెందిన శ్రీదేవి రూ. 29 లక్షలు రుణం తీసుకుంది. బాకీ చెల్లింపులో భాగంగా 2015 సెప్టెంబరులో రూ.29లక్షలకు చెక్కు ఇచ్చారు. పట్టాభినాయుడు చెక్కును బ్యాంకులో వేయగా.. ఖాతాలో ఎటువంటి నగదు లేదు. దీనిపై బాధితుడు కోర్టును ఆశ్రయించారు. నేరం రుజువుకావడంతో నిందితురాలికి ఆరు నెలలు జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

భార్య మృతి తట్టుకోలేక భర్త బలవన్మరణం

రామకుప్పం, న్యూస్‌టుడే: భార్య అనారోగ్యంతో మృతి చెందిందని మనస్తాపం చెందిన భర్త బలవన్మరణానికి పాల్పడిన సంఘటన సోమవారం మండలంలోని రాజుపేట వద్ద చోటుచేసుకుంది. కుప్పం గ్రామీణ సీఐ మల్లేష్ యాదవ్ వివరాల మేరకు... కర్ణాటక రాష్ట్రం కోలారు జిల్లా బాలువనహల్లి గ్రామానికి చెందిన గంగప్ప(89) భార్య లక్ష్మమ్మ అనారోగ్యంతో రెండు నెలల క్రితం మృతి చెందింది. ఆదివారం సాయంత్రం నుంచి గంగప్ప కనబడక పోవడంతో కుటుంబసభ్యులు బంధువులు, ఇతర ప్రాంతాల్లో వెతికినా ఫలితం లేకపోయింది. భార్య మరణించిందని మనస్తాపంతో గంగప్ప రామకుప్పం మండలం రాజుపేట గ్రామ సమీపంలో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతునికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


పుంగనూరు గ్రామీణ, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం సాయంత్రం పలమనేరు-పుంగనూరు బైపాస్‌రోడ్డు జే టౌన్ కూడలిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు.. మండలంలోని ఏతూరు పంచాయతీ రంగూన్‌మిట్ట గ్రామానికి చెందిన జాఫర్‌బాష కుమారుడు మహబూబ్‌బాష(26) ఇంటి నుంచి పుంగనూరుకు ద్విచక్రవాహనంపై వెళుతుండగా జే టౌన్ కూడలిలో రోడ్డు దాటుతుండగా పలమనేరు నుంచి మదనపల్లె వైపు వెళుతున్న లారీ ఢీకొంది. గాయాలకు గురైన అతన్ని 108 వాహనం ద్వారా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా మృతి చెందినట్లు సీఐ శ్రీనివాసులు పేర్కొన్నారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

5లోగా నామినల్ రోల్స్ అందజేయాలి

చిత్తూరు విద్య, న్యూస్‌టుడే: నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్) పరీక్షకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల నామినల్ రోల్స్, ఫీజు చలానాలు ఈ నెల 5లోగా అందజేయాలని డీఈవో దేవరాజు సోమవారం తెలిపారు. ప్రింటెడ్ ఎన్‌ఆర్‌లను నిర్దేశించిన గడువులోగా సంబంధిత హెచ్‌ఎం డీఈవో కార్యాలయంలో అందజేయాలని కోరారు.

చిత్తూరు

• చిత్తూరు • పూతలపట్టు • గంగాధరనెల్లూరు • నగరి



వరద బాధితులకు ఆర్థిక సాయం

చిత్తూరు (జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే: విజయవాడ వరద బాధితుల కోసం సీఎం సహాయ నిధికి తెదేపా వాణిజ్య విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు సునీల్‌కుమార్ చౌదరి ఆర్థిక సాయం చేశారు. సోమవారం అమరావతిలోని సచివాలయంలో సీఎం చంద్రబాబును కలిసి రూ.25 వేల చెక్కు అందజేశారు.

చంద్రబాబుకు చెక్కు అందజేస్తున్న సునీల్‌కుమార్

సీఐ బాధ్యతల స్వీకరణ



లక్ష్మీనారాయణ

జీడీనెల్లూరు: సీఐగా లక్ష్మీనారాయణ సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. బదిలీల్లో భాగంగా అన్నమయ్య జిల్లా దిశ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తూ ఇక్కడికి వచ్చారు. ఇక్కడ ఇన్‌ఛార్జిగా ఉన్న లక్ష్మన్న చిత్తూరు మహిళా పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM) చిత్తూరు నగరం: 80085 74598 నగరి: 80085 74568 గంగాధరనెల్లూరు: 80085 74605 పూతలపట్టు: 80085 74601

చిత్తూరు నగరం, న్యూస్‌టుడే:

సమస్య: స్థానిక శ్రీనగర్‌కాలనీలోని మురుగు కాలువల్లో చెత్త, వ్యర్థాలు పేరుకుపోయాయి. ఇబ్బందిగా మారింది.
- స్థానికులు

సమాధానం: వెంటనే పరిశీలించి పూడికతీత పనులు చేపడతాం. -అనిల్ కుమార్, నగరపాలక ఆరోగ్యాధికారి



టైరోమెర్ కంపెనీని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్

పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వం అండ

నింద్ర, న్యూస్‌టుడే: పరిశ్రమల స్థాపనకు తెదేపా ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే గాలిభానుప్రకాష్ అన్నారు. నింద్రలో కెనడా టెక్నాలజీతో కొత్తగా ఏర్పాటు చేసిన టైరోమెర్ సంస్థను ఆయన ప్రారంభించి మాట్లాడారు. నియోజకవర్గ పరిధిలో పరిశ్రమల స్థాపనకు ప్రత్యేక చొరవ తీసుకుంటామన్నారు. దేశంలో ప్రథమంగా జీరో వేస్ట్, కాలుష్యరహిత టైరోమెర్ కంపెనీని కెనడా టెక్నాలజీతో నిర్వహించడం అభినందనీయమన్నారు. అంబత్తూరు పారిశ్రామిక వేత్తల అసోసియేషన్ నాయకుడు ఆర్వేల రమేష్‌నాయుడు మాట్లాడారు. తెదేపా ప్రభుత్వ సహకారం మరువలేనిదన్నారు. ఎండీ ఆదర్శ్‌జలన్, తహసీల్దారు శేషగిరిరావు పాల్గొన్నారు. ❖ ఎస్ఎన్‌జే షుగర్స్‌లో రైతులకు చెరకు మద్దతు ధర పెంచే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి చొరవ తీసుకోవాలని నగరి నియోజకవర్గ ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్‌కు స్థానిక నేతాజీ చెరకు రైతు సంఘ అధ్యక్ష కార్యదర్శులు ఆదినారాయణరెడ్డి, ఆవుల శ్రీనివాసులుయాదవ్ కోరారు. ఆయన సానుకూలంగా స్పందించారు.

పశువుల మేత భూమి ఆక్రమణ

☛ దాహార్తి సమస్య తీర్చాలి ☛ కలెక్టరేట్‌లో పలువురు బాధితుల ఆవేదన

ఆక్రమించి ఆపై దౌర్జన్యం



గ్రామంలోని 8 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న పశువుల మేత భూముల్ని భూస్వాములు ఆక్రమించారని సదుం మండలం గాదేపల్లి ఎస్టీ కాలనీ వాసులు ఫిర్యాదు చేశారు. 50 గిరిజన కుటుంబాలకు చెందిన పశువులు ఈ భూమిలోనే మేత మేస్తున్నాయని చెప్పారు. సదరు భూస్వామి మేత భూముల్ని ఆక్రమించి చదును చేస్తున్నారని, ప్రశ్నించిన తమపై దౌర్జన్యం చేశారని వాపోయారు. న్యాయం చేయాలని కలెక్టర్‌ను కోరారు.

ట్యాంకర్ల కొనుగోలు



నీటి సమస్యకు పరిష్కారం చూపాలని చిత్తూరు గ్రామీణ మండలం జర్రిమడుగు ఎస్టీ కాలనీ వాసులు వాపోయారు. గత ప్రభుత్వ హయాంలో బోరువేసి, మోటారు, పైపులు ఏర్పాటుచేయడం విస్మరించారని తెలిపారు. దీంతో ప్రస్తుతం డబ్బులు చెల్లించి ట్యాంకర్ ద్వారా నీటిని కొనుగోలు చేస్తున్నామని ఆవేదన చెందారు. తమ గ్రామానికి దారి సౌకర్యం కల్పించాలని కోరారు.

చిత్తూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి 237 అర్జీలు అందాయి. అర్జీదారుల సమస్యలకు తక్షణమే పరిష్కారం చూపాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ సంబంధిత అధికారుల్ని ఆదేశించారు. జేసీ విద్యాధరి, డీఆర్‌వో పుల్లయ్య ఇతర అధికారులు పాల్గొన్నారు.



అర్జీదారుతో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్



వేచి ఉన్న అర్జీదారులు

పెండింగ్ వేతనాలు ఇవ్వాలి

సాంఘిక సంక్షేమ శాఖలో ఒప్పంద, పొరుగుసేవల పద్ధతిలో పనిచేస్తున్న 330 మంది ఉద్యోగులకు గతేడాది అక్టోబరులో 3 రోజుల వేతనాల్ని నిలిపివేయడం దారుణమని భాజపా పూతలపట్టు మండల అధ్యక్షుడు నరసింహులు నాయుడు తెలిపారు. దినసరి కూలీపై బ్రతికే ఉద్యోగుల జీతాలు వెంటనే చెల్లించాలని ఆయన వినతిచేశారు. ❖ ప్రభుత్వ శాఖల్లో ఒప్పంద, పొరుగుసేవలు, రోజువారీ, తాత్కాలిక పద్ధతిలో పనిచేస్తున్న ఉద్యోగులకు రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా వేతనాలు ఇవ్వాలని సీఐటీయూ శ్రేణులు నిరసన వ్యక్తంచేశాయి.

స్పందించారు.. సరిచేశారు

పుత్తూరు,న్యూస్‌టుడే: పుత్తూరు పురపాలిక పరిధిలోని చౌటూరు గ్రామ సమీపంలోని రైతు పొలంలోని స్తంభం సమస్యపై 'స్తంభం ఒరిగి.. ప్రమాదం పొంచి' శీర్షికన 'ఈనాడు'లో సోమవారం చిత్ర కథనం ప్రచురితమైంది. స్పందించిన విద్యుత్తుశాఖ అధికారులు ఒరిగిన స్తంభాన్ని సరిచేశారు. దీంతో అక్కడి రైతులు ఊపిరి పీల్చుకున్నారు.



ప్రజల సమస్యల్ని తెలుసుకుంటున్న కమిషనర్ నరసింహ ప్రసాద్

ప్రజా సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు

చిత్తూరు నగరం, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని నగరపాలక కమిషనర్ నరసింహ ప్రసాద్ ఆదేశించారు. స్థానిక నగరపాలక కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతులు స్వీకరించారు. ఇంజినీరింగ్ విభాగానికి 8, రెవెన్యూ 2, ప్రజారోగ్యం 1, ప్రధాన కార్యాలయం 1 చొప్పున వినతులు అందాయి. వీటిని తక్షణం పరిష్కరించాలని సంబంధిత విభాగాల అధికారులకు కమిషనర్ సూచించారు. సహాయ కమిషనర్ ప్రసాద్, ఎంఈ వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు.

చెస్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నిక


చిత్తూరు (క్రీడలు), న్యూస్‌టుడే: చెస్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా చిత్తూరు నగరానికి చెందిన ఎస్ఆర్‌డీ ప్రసాద్ ఎన్నికయ్యారు. విజయవాడలో ఆదివారం జరిగిన ఎన్నిక ప్రక్రియలో ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆయనను జిల్లా చెస్ సంఘం నాయకులు గజేంద్ర, జయకుమార్, వెంకటస్వామి, సాబు, చిన్ని తదితరులు సోమవారం సత్కరించారు.



ఎస్ఆర్‌డీ ప్రసాద్‌ను సత్కరిస్తున్న జిల్లా చెస్ సంఘం నాయకులు

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోండి

చిత్తూరు (వైద్యవిభాగం), న్యూస్‌టుడే: ప్రజలందరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని ఆరోగ్యంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి అనిల్‌కుమార్ తెలిపారు. చిత్తూరు నగరం మురకంబట్టులోని అర్బన్ ఆరోగ్య కేంద్రం పరిసరాలను సోమవారం పరిశీలించారు. నీరు నిల్వలు ఏర్పడటంతో దోమలు వృద్ధి చెందుతుందని చెప్పారు. దోమలు పుట్టినా, కుట్టినా అనారోగ్య సమస్యలు ఎదురవుతుందని తెలిపారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ప్రజలు పరిసరాల పరిశుభ్రతపై దృష్టి పెట్టాలన్నారు. కొన్ని ఇళ్లు సందర్శించి, అక్కడ నిల్వ ఉన్న నీరు పారబోయించి, ప్రజలకు అవగాహన కల్పించారు. సబ్-యూనిట్ అధికారి రామకృష్ణ, శివ సుబ్రహ్మణ్యం, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



నిల్వ నీటిని పారబోయిస్తున్న జిల్లా మలేరియా అధికారి అనిల్‌కుమార్

సభ్యత్వ నమోదు వేగవంతం చేయాలి

పెనుమూరు, న్యూస్‌టుడే: నియోజకవర్గంలో పార్టీ సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలని ఎమ్మెల్యే థామస్ అన్నారు. సోమవారం పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ బూత్ కన్వీనర్లు, నాయకులతో సమావేశం నిర్వహించారు. సభ్యత్వ నమోదు పూర్తి చేసిన బూత్‌కు బహుమతి అందిస్తామని చెప్పారు. మొదటి స్థానంలో నిలిచిన వారికి రూ.25 వేలు, రెండో స్థానం రూ.15 వేలు, మూడో స్థానం రూ.10 వేలు బహుమతి ఇస్తానని వివరించారు. వైకాపా వారు పార్టీలోకి వస్తామంటే ఆహ్వానించాలని సూచించారు. పెనుమూరు, శ్రీరంగరాజపురం మార్కెట్టు కమిటీ ఏర్పాటులో నాయకులు ఏకాభిప్రాయంతో పేర్లు ఇవ్వాలని అన్నారు. మాజీ ఎంపీపీ హరిబాబునాయుడు, అరుణ, రెడ్డెప్ప, రుద్రయ్యనాయుడు, లోకనాథరెడ్డి, స్వామిదాస్, చంగల్రాయయాదవ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే థామస్

రైతుల సేవే పరమావధిగా పనిచేయాలి

జీడీనెల్లూరు: రైతుల సేవే పరమావధిగా పనిచేయాలని జీడీనెల్లూరు సహకార సంఘ పర్సన్ ఇన్‌ఛార్జి శ్రీనివాసులురెడ్డి సిబ్బందిని, సహకార బ్యాంకు అధికారులను కోరారు. సోమవారం ఆయన సీఈవో విజయ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన మహాజనసభ కార్యక్రమంలో మాట్లాడుతూ రైతులు తీసుకున్న స్వల్ప, దీర్ఘకాలిక రుణాలను సకాలంలో చెల్లించేలా అవగాహన కల్పించి, వారు వడ్డీరాయితీ పొందేలా చూడాలన్నారు. బంగారంపై తక్కువ వడ్డీకి రుణాలు ఇస్తున్న విషయాన్ని వివరించాలన్నారు. మేనేజర్ మహేష్‌కుమార్, కార్యదర్శులతో కలిసి మొక్కలు నాటారు.



సహకార సంఘంలో మొక్క నాటుతున్న శ్రీనివాసులరెడ్డి



ఆర్డీఓ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న బీఎల్వోలు

బీఎల్వోలను పనిఒత్తిడితో వేధిస్తున్నారు

నగరి, న్యూస్‌టుడే: బీఎల్వోలుగా పనిచేసే సచివాలయ ఉద్యోగులపై పని ఒత్తిడి పెట్టి మానసికంగా వేధిస్తున్నారని సచివాలయ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కోశాధికారి తిరుమలయ్య ఆరోపించారు. ఆర్డీఓ కార్యాలయం వద్ద సోమవారం సచివాలయ ఉద్యోగులు నిరసన ప్రదర్శన చేశారు. సచివాలయ ఉద్యోగుల జిల్లా కో ఆర్డినేటర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ బీఎల్ఓలకు బానిసలుగా చూడొద్దని, తమ డిమాండ్లు పరిష్కరించి పని ఒత్తిడిని తగ్గించాలని డిమాండ్ చేశారు. బీఎల్ఓలకు నాలుగేళ్లుగా చెల్లించాల్సిన బకాయిలు చెల్లించాలని, సచివాలయ ఉద్యోగులను డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజు మాట్లాడారు. నగరి సీఐ మహేశ్వర్ అక్కడకు చేరుకొని వారితో మాట్లాడారు. వినతిపత్రం ఆర్డీఓ వెంకటరెడ్డికి అందించారు.

పోలీస్ స్టేషన్‌లో శ్రమదానం

నగరి,న్యూస్‌టుడే: ఆధ్యాత్మిక ప్రజాసేవా ఉద్యమం 22వ వార్షికోత్సవం సందర్భంగా ఓంశక్తి సేవకులు సోమవారం నగరి పోలీస్ స్టేషన్‌లో శ్రమదానం చేశారు. పోలీస్ స్టేషన్ పరిసరాలలో చెత్తకుప్పలు తొలగించి, పిచ్చిమొక్కలు తొలగించారు. పట్టణంలోని ఓరుగుంటాలమ్మ దేవాలయం, దేశమ్మ దేవాలయం పరిసరాలలో శ్రమదానంతో స్వచ్ఛత చర్యలు చేపట్టారు. భాస్కర్, గోవిందస్వామి, ఈశ్వర్, కృష్ణమోహన్, ఎల్లప్పరెడ్డి, షణ్ముగం పాల్గొన్నారు.

రాష్ట్ర జట్టుకు ఎంపిక

పుత్తూరు, న్యూస్‌టుడే: తిరుపతిలో ఆదివారం జరిగిన జిల్లా స్థాయి అండర్-17 బాలుర విభాగంలో రోడ్ స్కేటింగ్, స్పీడ్ స్కేటింగ్ పోటీల్లో గేటుపుత్తూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థి నిరంజన్‌సాయి ప్రథమ, ద్వితీయ బహుమతి సాధించి రాష్ట్ర స్థాయి జట్టుకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కేజే వేములు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆ విద్యార్థిని అభినందించారు.

ఎక్సైజ్ సీఐ బాధ్యతల స్వీకరణ



శ్రీహరి

చిత్తూరు (నేరవార్తలు), న్యూస్‌టుడే: చిత్తూరు ఎక్సైజ్ అర్బన్ సీఐగా శ్రీహరి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆ స్థానంలో ఉన్న హరికృష్ణ బదిలీ కావడంతో ఆయన స్థానంలో శ్రీహరి బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఎక్సైజ్ డీసీ విజయశేఖర్, ఈఎస్ శ్రీనివాసాచ్చారిని మర్యాదపూర్వకంగా కలిశారు.

బాలలకు నైతిక విలువలు నేర్పాలి.. చిత్తూరు(సంతపేట): బాలబాలికలకు నైతిక విలువలు నేర్పాలని సత్యసాయి సేవా సమితి బాల వికాస్ సమన్వయకర్త వసంత తెలిపారు. స్థానిక గిరింపేటలో సత్యసాయి మందిరంలో బాలవికాస్ గురువుల శిక్షణాలో బోధనా పద్ధతులు, బోధనాంశాలపై అవగాహన కల్పించారు. గిరింపేటలోని సత్యసాయి మందిరంలో రుద్రాభిషేక పూజల్ని శాస్త్రోక్తంగా జరిపారు.



పక్షోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేస్తున్న దృశ్యం

ప్రపంచంలో తృతీయ భాష హిందీ

పుత్తూరు, న్యూస్‌టుడే: ప్రపంచలోనే అత్యధికులు మాట్లాడే భాషల్లో హిందీ తృతీయ స్థానంలో ఉందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ కోటేశ్వరయ్య పేర్కొన్నారు. కళాశాలలో సోమవారం హిందీభాషా పక్షోత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాసం, నృత్యం, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. హిందీ విభాగ అధ్యక్షుడు వాణిశ్రీ, కళాశాల వైస్ ప్రిన్సిపల్ వీరయ్య, మన్యం నరసింహులు పాల్గొన్నారు.

అవీ ఇవీ అన్నీ

రేపు విద్యుత్తు సమస్యలపై వినతుల స్వీకరణ.. చిత్తూరు(మిట్టూరు): విద్యుత్తు శాఖ తిరుపతి సర్కిల్ పరిధిలోని ఎనిమిది డివిజన్, 27 సబ్-డివిజన్ కార్యాలయాల్లో విద్యుత్తు సమస్యల పరిష్కారానికి బుధవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు వినతులు స్వీకరించనున్నామని ఎస్ఈ సురేంద్రనాయుడు తెలిపారు. చిత్తూరు అర్బన్ డివిజన్‌కు సంబంధించి గాంధీరోడ్డులో ఈఈ, సబ్- డివిజన్ కార్యాలయంలో వినతులు స్వీకరిస్తామని ఈఈ మునిచంద్ర తెలిపారు.

పారిశుద్ధ్య పనులు వేగవంతం.. వెదురుకుప్పం: స్వచ్ఛతా హీ పక్షోత్సవాలలో భాగంగా మండల పరిధి బ్రాహ్మణపల్లె పంచాయతీలో పారిశుద్ధ్య పనులు జోరందుకున్నాయి. సోమవారం స్థానిక సర్పంచి శిరిషా యంత్రాలు, ట్రాక్టర్లతో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. కమ్మకండ్రిగ, బ్రాహ్మణపల్లె(దిగువ), ఎగువ గ్రామాల్లో డీడీవో రితేష్ ఆధ్వర్యంలో చేపట్టిన పనులను ఈవోపీఆర్‌ఆర్డీ పురుషోత్తం పర్యవేక్షించారు.

ఉపాధ్యాయవృత్తి సమాజానికి ఆదర్శం.. జీడీనెల్లూరు: ఉపాధ్యాయవృత్తి సమాజానికి ఆదర్శంగా ఉండేలా సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుడు నీరజాక్షులనాయుడు 35 ఏళ్లపాటు పనిచేసినట్లు జిల్లా ఉపవిద్యాశాఖాధికారి చంద్రశేఖర్ అన్నారు. నెల్లేపల్లె హైస్కూలులో పనిచేస్తూ సోమవారం పదవీవిరమణ పొందుతున్న ఆయనను పాఠశాల ఆవరణలో ఎంఈవో గుణశేఖర్‌రెడ్డి, హెచ్‌ఎం సుబ్బరత్నమ్మ, సహాయ హెచ్‌ఎం యుగంధరాచ్చారి సన్మానించారు.

చిన్నారికి ఆర్థిక సాయం.. పుత్తూరు: నందిమంగళం దళితవాడకు చెందిన చిరంజీవులు, నదియా దంపతుల కుమారై మోక్షిత(6) లివర్ వ్యాధితో బాధపడుతూ చెన్నైలోని ఓ ప్రవేటు వైద్యశాలలో చికిత్స పొందుతోంది. చిన్నారి వైద్యం కోసం పుత్తూరుకు చెందిన శ్రీభవానీ విష్ణు పుత్తూరు జనసేన నాయకులు ద్వారా సోమవారం వారి కుటుంబసభ్యులకు రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు.

ఆక్రమణలు తొలగించండి.. పెనుమూరు: గ్రామానికి చెందిన శ్మశాన స్థలాన్ని నరేంద్ర అనే వ్యక్తి ఆక్రమించుకుని మామిడి చెట్లు నాటారు. వాటిని తొలగించాలని మండలంలో విడిదిపల్లె గ్రామస్థులు తహసీల్దారు శ్రామణ్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. సోమవారం ప్రజాఫిర్యాదుల దినం సందర్భంగా గ్రామస్థులు కార్యాలయం వద్దకు చేరుకుని తమ ఆవేదనను తెలిపారు. అలాగే ఈశ్వరబాబు రాళ్లకుంటను ఆక్రమించుకున్నారని వివరించారు. ఆక్రమణలు తొలగించాలని కోరారు. ఆర్ఐ, సర్వేయర్‌ను పంపి సర్వే చేయించి ఆక్రమణలు తొలగిస్తామని తహసీల్దారు గ్రామస్థులకు హామీ ఇచ్చారు.

ధర్మదీక్ష ర్యాలీకి ఘనస్వాగతం.. నగరి: త్రివేంద్రం నుంచి తరలివస్తున్న అంబేడ్కర్, అశోక ధర్మదీక్ష ర్యాలీకి నగరి పట్టణం సత్రవాడ వద్ద సోమవారం అఖిల భారత అంబేడ్కర్ యువజన సంఘం ప్రతినిధులు ఘనంగా స్వాగతం పలికారు. త్రివేంద్రం నుంచి నాగపూర్ వద్ద దీక్ష భూమికి ఈ ర్యాలీ విజయదశమి నాటికి చేరుకుంటుందని నిర్వాహకులు తెలిపారు. ఈ ర్యాలీలో బౌద్ధ భిక్షకులు ప్రత్యేక వాహనంలో తరలి వచ్చారు.

ఆర్డీవోకు 14 వినతులు .. చిత్తూరు గ్రామీణ: రైతులు, ప్రజల నుంచి ఆన్‌లైన్, వినతుల రూపంలో 14 వినతుల్ని స్వీకరించినట్లు ఆర్డీవో చిన్నయ్య తెలిపారు. ఆర్డీవో కార్యాలయంలో సోమవారం రైతులు, ప్రజల నుంచి వినతుల్ని స్వీకరించి, మాట్లాడారు. భూ తగాదాలకు 5, భూ సర్వేనకు 4, పట్టాదారు పాసుపుస్తకంలో తప్పులకు 2, పౌరసేవలకు సంబంధించి మూడు అర్జీలు అందాయన్నారు.

మహిళలపై దాడులు అరికట్టాలి.. తవణంపల్లె: ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ మహిళలపై జరుగుతున్న దాడులు, అత్యాచారాలు అరికట్టాలని సీపీఎం న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి సురేంద్రనాథ్ డిమాండ్ చేశారు. సత్యశోధక్ సమాజ్ ఆవిర్భావ దినోత్సవాన్ని పరష్కరించుకుని మండల కేంద్రంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

హక్కులు సద్వినియోగం చేసుకోండి.. యాదమరి: ప్రజలు హక్కులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దారు పార్థసారథి పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం మార్లబండలోని కాలనీలో సివిల్ రైట్స్‌పై స్థానికులకు అవగాహన కల్పించారు. స్థానికులు విన్నవించిన సమస్యలను పరిష్కరిస్తామని హామీనిచ్చారు.

మొగిలి ఘాట్‌లో ప్రమాద నివారణ చర్యలు.. బంగారుపాళ్యం: చిత్తూరు, పలమనేరు జాతీయ రహదారిలోని మొగిలిఘాట్ రోడ్డులో తరచూ జరుగుతున్న ప్రమాదాల నివారణకు సీఐ శ్రీనివాసులు వినూత్న యత్నం చేశారు. ఘాట్ రోడ్డులో ఎస్ ఆకారంలోని మలుపు వద్ద వాహనదారులను అప్రమత్తం చేస్తూ సుమారు 10 అడుగుల ఎత్తుతో రేడియం స్టిక్కర్లు అమర్చిన ట్రాఫిక్ కానిస్టేబుల్ కటౌట్ ఏర్పాటు చేశారు.

పరిశుభ్రత చర్యలపై దృష్టి పెట్టాలి

నగరి, న్యూస్‌టుడే: పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మున్సిపల్ ఛైర్మన్ నీలమేఘం పేర్కొన్నారు. మున్సిపల్ కార్యాలయంలో సోమవారం మున్సిపల్ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పనులు చేపట్టడంలో అన్ని వార్డులకు సమాన ప్రాతిపదికన పనులు జరగాలని పేర్కొన్నారు. మున్సిపల్ కమిషనర్ కె.వి.కృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రధానంగా పన్నుల వసూళ్ల విషయంలో ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు. మున్సిపల్ వైస్‌ఛైర్మన్లు బాలన్, వెంకటరత్నంరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మున్సిపల్ ఛైర్మన్ నీలమేఘం

సుందరీకరణకు.. ట్యాంకర్ల నీరే దిక్కు



చిత్తూరు నగరం గాంధీ కూడలిలో ఏర్పాటు చేసిన నీటి ఫౌంటెయిన్ కోసం నిత్యం నీటిని తరలిస్తున్నారు. నగరంలో సుందరీకరణకు గత ప్రభుత్వ హయాంలో రూ. లక్షల వెచ్చించారు. కానీ ఇక్కడి పచ్చదనం పరిరక్షణకు కనీసం కుళాయి ఏర్పాటు చేయలేదు. మొక్కలు మాత్రం భారీ ఎత్తున నాటేశారు. ఇటు మొక్కలకు, అటు ఫౌంటెయిన్ కోసం నిత్యం ఇలా సుదూర ప్రాంతం నుంచి ట్యాంకర్లతో నీటిని తరలించటం వ్యయప్రయాసలతో కూడిన పని. బోరు పైపును ఏర్పాటు చేస్తే ఇటు వ్యయం, అటు శ్రమ తగ్గటంతోపాటు సుందరీకరణకు అనుకూలంగా ఉంటుంది.

\- ఈనాడు, చిత్తూరు



ప్రతిజ్ఞ చేస్తున్న బండపల్లె జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు

బాల్య వివాహాలు నియంత్రించాలి

పూతలపట్టు, న్యూస్‌టుడే: బాల్య వివాహాల నియంత్రణ, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రియల్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు రామారావు అన్నారు. బండపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులకు సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. యాక్సెస్ టు జస్టిస్ పథకం జిల్లా మేనేజర్ హనీషా మాట్లాడుతూ బాలలను పనులు చేసేందుకు దుకాణాలు, వర్క్‌షాప్‌లో పెట్టుకోకూడదని చెప్పారు. బాధ్యతగా పనిచేస్తామని ప్రతిజ్ఞ చేశారు. హెచ్‌ఎం దామోదరనాయుడు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అబాకస్ పోటీల్లో పీఇఎస్ విద్యార్థి ప్రతిభ

యాదమరి, న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయి అబాకస్ పోటీల్లో పీఇఎస్ విద్యార్థి ఎస్. భార్గవ్ (4వ తరగతి) రీజనల్ ఛాంపియన్‌గా నిలిచాడు. ఉత్తమ ప్రతిభ కనబరచిన ఆ విద్యార్థిని సోమవారం పాఠశాలలో తెలుగు యువత జిల్లా అధికార ప్రతినిధి అమరనాథనాయుడు, నాయకుడు కృష్ణమూర్తి సత్కరించి, అభినందించారు.



భార్గవ్‌ను అభినందిస్తున్న అమరనాథనాయుడు, కృష్ణమూర్తి

పలమనేరు

•పలమనేరు •కుప్పం •పుంగనూరు

పీఈఎస్‌లో వార్షిక క్రీడోత్సవాలు ప్రారంభం


ఉత్సవాల ప్రారంభంలో ప్రిన్సిపల్ క్రిష్ణారావు తదితరులు

కుప్పం, న్యూస్‌టుడే: స్థానిక పీఈఎస్ వైద్య కళాశాలలో వార్షిక క్రీడోత్సవాలను ప్రిన్సిపల్ డాక్టర్ హెచ్.ఆర్.క్రిష్ణారావు సోమవారం ప్రారంభించారు. క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. వివిధ రకాల క్రీడల తోపాటు సాంస్కృతిక పోటీలను నిర్వహిస్తామని తెలిపారు. సంగీతం, సంప్రదాయ నృత్యం తదితర పోటీలు జరుగుతాయని వివరించారు. వైద్య విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

వేడుకగా అర్జున తపస్సు.. సదుం, న్యూస్‌టుడే: బట్టువారిపల్లెలో నిర్వహిస్తున్న మహాభారతయజ్ఞంలో భాగంగా సోమవారం అర్జున తపస్సు కార్యక్రమం భక్తులను అలరించింది. అర్జున పాత్రధారి పద్యాలు పాడుతూ తపస్సు మాను అధిరోహించాడు. అతను విసిరే నిమ్మకాయల కోసం భక్తులు ఎగబడ్డారు. పాండవుల విగ్రహాలకు పూజలు చేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా..
(10 AM TO 1 PM)
పలమనేరు: 80085 74580
కుప్పం పట్టణం: 80085 73490
పుంగనూరు: 80085 74622

గంగవరం, న్యూస్‌టుడే

సమస్య: మండలంలోని కలగటూరు గ్రామంలో తాగునీటి కుళాయిలు మురుగునీటిలో ఉన్నాయి. వీటి వలన తీవ్ర ఇబ్బందులు పడుతున్నాము. కుళాయిలను కాలువ గట్టపై ఏర్పాటు చేయాలి. - స్థానికులు

సమాధానం: పరిశీలించి సమస్యను వెంటనే పరిష్కరిస్తాం. - వేణు, పంచాయతీ కార్యదర్శి

పుంగనూరు, న్యూస్‌టుడే

సమస్య: స్థానిక రాయలచెరువు కాలువలో ఐదేవల పూడికతీత, పిచ్చిమొక్కల తొలగింపు వంటి పనులు చేశారు. అయితే రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఇసుక మేటలు ఏర్పడుతున్నాయి. వాటిని తొలగించాలి - రెడ్డెప్ప, స్థానికుడు

సమాధానం: ఇసుక మేటలను తొలగించి మురుగు సాఫీగా సాగేలా చర్యలు తీసుకుంటాం. - వెంకటసుబ్బయ్య, శానిటరీ ఇన్‌స్పెక్టరు, పుంగనూరు


అధికారులతో మాట్లాడుతున్న అమరనాథరెడ్డి

ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేద్దాం

పలమనేరు, న్యూస్‌టుడే: నియోజకవర్గ పరిధిలో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి అన్నారు. సాధారణ బదిలీల్లో భాగంగా సోమవారం విధులు చేపట్టిన వివిధ శాఖల అధికారులతో తన కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ నిత్యం అభివృద్ధి కార్యక్రమాల్లో పాలు పంచుకోవాలని సూచించారు. పలమనేరు ఎక్సైజ్ సీఐగా విధుల్లో చేరిన భాగ్యలక్ష్మి, సబ్‌రిజిస్ట్రార్ సుబ్రహ్మణ్యం, పలమనేరు డిప్యూటీ తహసీల్దారు అనిల్‌కుమార్ ఎమ్మెల్యేను కలిసి పుష్పగుచ్ఛాలు అందించారు.

గంగులమ్మ మృతికి ఎమ్మెల్యే నివాళి

చౌడేపల్లె: కాగతి పంచాయతీ పెద్దూరు కురప్పల్లెకు చెందిన తెదేపా అభిమాని రమణ తల్లి గంగులమ్మ సోమవారం మృతి చెందింది. ఆమె మృతదేహాన్ని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి నివాళులర్పించారు.

ముఖ్యమంత్రిని కలిసిన తెదేపా నాయకులు

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర మంత్రి నారా లోకేశ్‌ను కుప్పం తెదేపా మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్, రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షుడు కాణిపాకం వెంకటేష్ సోమవారం కలిశారు. ఉండవల్లి నివాసంలో వారి కలిసి కుప్పం పురపాలిక పరిధిలోని చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై వివరించినట్లు తెలిపారు.


సీఎం చంద్రబాబుకి ప్రసాదం అందజేస్తున్న నాయకులు



ఈ చిత్రంలో ఎండిపోయిన వేరుసెనగ వి.కోట మండలం గుమ్మిరెడ్డిపల్లెకు చెందిన రైతు రత్నంరాజు పొలం. ఎకరాలో పంట సాగు చేశారు. వాన కురవక పూర్తిగా ఎండిపోయింది. సాగుకు రూ. 25 వేలు ఖర్చు చేశానని రైతు వాపోయారు. అంతర పంటలుగా వేసిన ఆనప, కంది, జొన్న సైతం ఎండిపోయాయి. వేరుసెనగ ఒబ్బిడి చేయడానికి వాన లేక పొలంలోనే ఎండుతోంది. పంట చేతికి వచ్చినా 5-6 బస్తాలు దిగుబడి వచ్చే అవకాశముంది.



ఈ చిత్రంలో వేరుసెనగ ఒబ్బిడి చేస్తున్న రైతు పేరు వెంకటరమణ. పెద్దపంజాణి మండలం బసవరాజుకండ్రిగ గ్రామానికి చెందిన ఇతను 2 ఎకరాల్లో సాగు చేశారు. దుక్కి, విత్తనాలు, ఎరువులు, కలుపుతీతకు రూ. 50 వేలు ఖర్చు చేశారు. వేరుసెనగ కాయలు ఏర్పడే సమయంలో వాన లేక పంట ఎండిపోయి దిగుబడి తగ్గింది. రెండెకరాలకు 9 బస్తాల దిగుబడి రావడంతో పెట్టుబడి ఖర్చు కూడా రాలేదని రైతు వాపోయారు. ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

ఒబ్బిడి.. నీరందక ఇబ్బంది

వానలు లేక రైతులకు అగచాట్లు

రెండేళ్లుగా పెట్టుబడి దక్కని వైనం

బైరెడ్డిపల్లె, వి.కోట, పెద్దపంజాణి, న్యూస్‌టుడే: మెట్టభూముల్లో వర్షాధారంగా సాగు చేసే వేరుసెనగ సాగు విస్తీర్ణం ఏటికేడు గణనీయంగా పడిపోతుంది. అదనులో పదును కురవక ఏటా రైతులకు చేదు అనుభవం ఎదురుకావడంతో సాగుకు స్వస్తి పలుకున్నారు. జిల్లాలో వేరుసెనగ సాధారణ సాగు విస్తీర్ణం 43,174 హెక్టార్లు కాగా.. ఈ ఖరీఫ్ సీజనులో కేవలం 13,612 హెక్టార్లకే పరిమితమైంది. ఇదీ సాధారణ సాగులో 31 శాతం మాత్రమే. ఇందులోనూ పలమనేరు, కుప్పం, పుంగనూరు నియోజకవర్గాల పరిధిలోనే అధికం.

అదనపు వ్యయం

వర్షాభావ పరిస్థితులతో వరుసగా వరుసగా నష్టం ఏర్పడటం, పెట్టుబడి ఖర్చులు పెరగడం, అటవీ సరిహద్దు ప్రాంతాల్లో వన్యప్రాణుల బెడద రైతులకు తీరని నష్టాన్ని మిగుల్చుతోంది. ఈ ఏడాది లోటు వర్షపాతంతో రైతులు అరకొర పండిన వేరుసెనగ ఒబ్బిడి చేసుకోవడానికి నానా అగచాట్లు పడుతున్నారు. నేలలో తేమ లేకపోవడంతో ట్రాక్టర్లతో దున్ని పంట తీయడం, ట్యాంకర్లతో నీటి తడులు ఇవ్వడానికి ఖర్చు తడిసిమోపెడవుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పశ్చిమ మండలాల్లో కష్టాలు వర్ణనాతీతం.

రెండేళ్లుగా నష్టాలే



వేరుసెనగ పంట సాగు చేసి నష్టపోతున్నాం. ఎకరా సాగుకు రూ. 20 వేలు ఖర్చు చేశా. పంట పూర్తిగా ఎండిపోయి నష్టపోయా. 5 బస్తాలే దిగుబడి వచ్చింది. పండిన పంట నాణ్యత లేదు. కాయలో గింజలు సన్నగా ఉండటంతో తక్కువ ధరకు అమ్ముకోవాల్సి వస్తోంది. రూ. 10 వేలు మాత్రమే వచ్చింది.

- హరిబాబు, రైతు, గల్లావారిపల్లె, పెద్దపంజాణి మండలం

ఎకరానికి ఐదు బస్తాలే దిగుబడి

వేరుసెనగ పంట దిగుబడి అంతంత మాత్రమే. పండినా నాణ్యత లేదు. అదనులో పదును కురవక కాయలో నాణ్యత లోపించింది. ఎకరానికి ఐదు బస్తాలు మించి దిగుబడి రావట్లేదని రైతులు వాపోతున్నారు. వానలు కురిసి పంట బాగా పండితే ఎకరానికి 20 బస్తాలు పైగా వచ్చేవి. ఒబ్బిడి చేయడానికి వాన లేక ఎండుతోంది. ఎండుతున్న పంటను ట్యాంకర్లతో తడపడానికి ఖర్చు భారంగా మారడంతో రైతులు వెనుకడుగు వేస్తున్నారు.

ఎక్సైజ్‌శాఖ సీఐగా మాధవన్‌స్వామి



కల్లూరు: పులిచెర్ల ఎక్సైజ్ శాఖ సీఐగా ఎ. మాధవన్‌స్వామి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన చిత్తూరు ఇంటెలిజెన్స్ విభాగం సీఐగా పనిచేస్తూ ఇక్కడకు బదిలీపై వచ్చారు.

ఎంపీడీవోగా లక్ష్మీకాంత్

రామకుప్పం: రామకుప్పం ఎంపీడీవోగా లక్ష్మీకాంత్ సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. ఆయన విజయనగరం జిల్లా నుంచి బదిలీపై రామకుప్పం వచ్చినట్లు తెలిపారు. అనంతరం స్థానిక కూటమి నేతలు లక్ష్మీకాంత్‌కు ఘన సత్కారం చేశారు. కార్యక్రమంలో తెదేపా మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి, నరసింహులు, విశ్వనాథ్, రామృష్ణప్ప, వెంకటాచలం, తదితరుల పాల్గొన్నారు. డీటీగా అశోక్ కుమార్ బాధ్యతలు స్వీకరించారు.

ఏపీఎం, నలుగురు సీసీలు..

చౌడేపల్లె: స్థానిక స్త్రీశక్తి భవనంలో మండల వెలుగు నూతన అధికారులు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇందులో ఇక్కడ ఏపీఎంగా సుబ్రమణ్యం, సీసీలు సుగుణ, నాగరత్న, రమేష్, వెంకటపతి బాధ్యతలు స్వీకరించారు. అదే విధంగా డీఎంజీ రేఖ, స్త్రీనిధి మేనేజరు రమ్యసాయి బాధ్యతలు చేపట్టారు. ఏపీఎంను మాలమహానాడు జిల్లా ఉపాధ్యక్షులు శివకుమార్, మండలాధ్యక్షులు కొత్తపల్లె మణి, కూరపర్తి ఈశ్వర్, నాయకులు సత్కరించారు.

బాధితుడికి న్యాయం చేకూర్చాలి

పుంగనూరు: అన్నమయ్య జిల్లా రామసముద్రం దిగువ దళితవాడకు చెందిన గోవిందు(35)పై దాడికి పాల్పడిన అగ్రవర్ణాలకు చెందిన నిందితులను అరెస్టు చేసి బాధితునికి న్యాయం చేకూర్చాలని మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి అశోక్ అన్నారు. సోమవారం స్థానిక ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితున్ని పరామర్శించారు. టమాట తోటలో చోరీకి పాల్పడ్డాడనే నింద మోపి బాధితున్ని చితకబాదిన ఆదినారాయణరెడ్డి, ధనుంజయరెడ్డి తదితరులపై ఎస్సీ, ఎస్టీ వేధింపుల కేసు నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు మోహన్, మనోహర్, చంద్రయ్య, కృష్ణప్ప, జయరాజ్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న పురపాలక ఛైర్మన్ అలీంబాషా

పుంగనూరు: పట్టణంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కౌన్సిల్ సభ్యులు డిమాండు చేశారు. సోమవారం పురపాలిక ఛైర్మన్ అలీంబాషా అధ్యక్షతన నిర్వహించిన పురపాలక సాధారణ సమావేశంలో సభ్యులు పలు సమస్యలను ప్రస్తావించారు. సభ్యుడు రహంతుల్లా మాట్లాడుతూ ఉబేదుల్లా కాంపౌండులోని నీటిశుద్ధి కేంద్రం యంత్రాలు, నీటివసతి ఉన్నా నిర్వహణ చేసేవారు లేక నిరుపయోగంగా ఉందన్నారు. మరో సభ్యురాలు రేష్మా మాట్లాడుతూ స్థానిక రామసముద్రం రోడ్డులో ట్యాంక్ బండ్ నుంచి డిగ్రీ కళాశాల వరకు, వనమలదిన్నె రోడ్డులో గల గోతులను పూడ్చాలని కోరారు. సభ్యురాలు జయభారతి మాట్లాడుతూ తన వార్డులో వీధిదీపాల మరమ్మతులో జాప్యం జరుగుతోందన్నారు. కమిషనరు మధుసూదనరెడ్డి మాట్లాడుతూ ప్రతి వార్డులో నెలకొన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని తెలిపారు. వైస్ ఛైర్మన్లు నాగేంద్ర, లలిత, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేయాలి


మాట్లాడుతున్న చాముండేశ్వరి

పలమనేరు: కౌండిన్య ప్రాజెక్టుకు అనుబంధంగా ఉన్న గంగన్న శిరస్సు ప్రాజెక్టును పూర్తి చేస్తే ప్రజలకు శాశ్వత తాగునీటి సమస్య పరిష్కారమవుతుందని పలువురు కౌన్సిలర్లు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. సోమవారం ఉదయం మున్సిపల్ కార్యాలయంలో ఛైర్‌పర్సన్ చాముండేశ్వరి ఆధ్వర్యంలో మున్సిపల్ సాధారణ సమావేశాన్ని నిర్వహించారు. కౌన్సిలర్ మురళీకృష్ణ మాట్లాడుతూ గంగన్న శిరస్సు పనులు పూర్తి చేయడానికి ప్రయత్నించాలని కోరారు. చిత్తూరు మాజీ ఎంపి రెడ్డెప్ప మంజూరు చేసిన రూ.45 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టాలని కోరారు. మున్సిపల్ పరిధిలో అవసరం ఉన్న ప్రాంతాల్లో రూ.20 లక్షలతో పనులు చేపట్టనున్నట్లు ఛైర్‌పర్సన్ తెలిపారు. అసంపూర్తిగా ఉన్న మున్సిపల్ కాంప్లెక్సులను పూర్తి చేయాలని కౌన్సిలర్ శారద సూచించారు. కాగా పట్టణంలోని హోటళ్లలో ఇష్టారాజ్యంగా వినియోగదారుల నుంచి సొమ్ములు వసూలు చేస్తున్నారని కౌన్సిలర్ నయాజ్ ఆరోపించారు. మత్స్య కార్యాలయం వద్ద ఆడిటోరియం నిర్మించడానికి ఇప్పటికే డీపీఆర్ సిద్ధమైందని పనులు చేపట్టాలని కౌన్సిలర్ కోదండరామయ్య సూచించారు. ఇటీవల విజయవాడ వరద ప్రాంతాలకు వెళ్లి సేవలందించిన పారిశుద్ధి కార్మికులు 28 మందిని మున్సిపల్ కౌన్సిలర్లు సన్మానించారు. సమావేశంలో కమిషనర్ ఎన్వీర మణారెడ్డి, మేనేజరు ఖాదర్ మొహిద్దీన్ పాల్గొన్నారు.

పాడి రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

కుప్పం గ్రామీణ: పాడి రైతుల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోందని తెదేపా మండల అధ్యక్షుడు ప్రేమ్ కుమార్ అన్నారు. మండల పరిధి గరిగచీనేపల్లి గ్రామంలో ఆయన గోకులం షెడ్ల నిర్మాణ పనులను భూమి పూజ చేసి ప్రారంభించారు. చెక్కునత్తం ఎస్సీ కాలనీలో తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మనణి, పార్టీ పంచాయతీ అధ్యక్షులు పూజలు చేసి ప్రారంభించారు.

అధికారుల తప్పు.. మురుగు ముప్పు

తిరుమలనాయనికుప్పంలో సిమెంటు రోడ్లు నిర్మించినా కాలువల్లేక మురుగు వీధుల్లోనే ప్రవహిస్తోంది. అధికారులు మొదట కాల్వలు నిర్మించి.. సీసీ రహదారులు వేయాల్సి ఉండగా.. అందుకు విరుద్ధంగా రోడ్డేసి చేతులు దులుపుకున్నారు. ప్రజలు ఇళ్లలోని వ్యర్థాలు, మురుగునీరు వీధులపైకి వదిలేయడంతో పారిశుధ్యం లోపిస్తోంది. దోమలు వృద్ధి చెంది వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. దోమ కాటుతో డెంగీ, మలేరియా జ్వరాలకు ఆస్కారముంది. ఎంపీడీవో రాజేంద్రబాలాజీ వివరణ కోరగా వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు.

- న్యూస్‌టుడే, బైరెడ్డిపల్లె



పోలీస్ ఔట్ పోస్టుకు పూర్వ వైభవం



శాంతిపురంలోని పోలీస్ ఔట్ పోస్టుకు ఎట్టకేలకు పూర్వ వైభవం రాబోతోంది. రాళ్లబూదుగూరులో పోలీస్‌స్టేషన్ ఉన్నందున.. మండల కేంద్రంలో ప్రజల సౌకర్యార్థం దాదాపు 20 ఏళ్ల కిందట ఔట్ పోస్టును ఏర్పాటు చేశారు. ఐదేళ్ల వైకాపా పాలన పుణ్యమా అని ఔట్ పోస్టు మూతపడింది. కూటమి ప్రభుత్వం అధికారాన్ని చేపట్టడంతో కార్యాలయాన్ని వినియోగంలోకి తీసుకురావడానికి పోలీస్ అధికారులు చర్యలు చేపట్టి భవనానికి రంగులు వేశారు. మండల కేంద్రంలో సీసీ కెమెరాల ఏర్పాటు.. ఔట్‌పోస్టులో నిఘా వ్యవస్థను నెలకొల్పేందుకు చకచకా చర్యలు చేపడుతున్నారు.

- న్యూస్‌టుడే, శాంతిపురం

చీకటిపడితే భయం.. భయం

మండల కేంద్రమైన సోమలలో చీకటి పడితే కుక్కలతో స్థానికులు భయం... భయంగా గడుపుతున్నారు. బస్టాండు ప్రాంతంలో వీధి కుక్కలు గుంపుగా ఏర్పడి ప్రజలపై దాడులకు దిగి గాయపరుస్తున్నాయి. పంచాయతీ వారు స్పందించి కుక్కల బెడద నుంచి రక్షించాలని ప్రజలు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, సోమల





అధ్వానంగా ఈడిగపల్లె రోడ్డు

మండలంలోని ఈడిగపల్లె-అన్నమయ్య జిల్లా రామసముద్రం మండలం చెంబకూరుకు వెళ్లే మార్గంలో రోడ్డుపై గుంతలు పడి అధ్వానంగా తయారైంది. ద్విచక్రవాహనాలు, ఆటోలు ఈ రహదారిపై వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పలుసార్లు ప్రమాదాలకు గురై క్షతగాత్రులైన సంఘటలను ఉన్నాయి. వెంటనే రోడ్డు మరమ్మతులు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఈ విషయమై రోడ్లు భవనాల శాఖ డీఈఈ సురేష్‌బాబు మాట్లాడుతూ పరిశీలించి మరమ్మతులు చేపడుతామని పేర్కొన్నారు. - న్యూస్‌టుడే, పుంగనూరు గ్రామీణ

అవీ.. ఇవీ.. అన్నీ..

నేడు ఉచిత నేత్ర చికిత్స శిబిరం.. బైరెడ్డిపల్లె: పీహెచ్‌సీ ఆవరణలో మంగళవారం కోలారు జాలప్ప ఆస్పత్రి వైద్యుల ఆధ్వర్యంలో ఉచిత నేత్ర చికిత్స శిబిరం నిర్వహించనున్నట్లు వైద్యాధికారి విజయ్‌చందర్ తెలిపారు.

2న ఉపాధి అవకాశాలపై అవగాహన.. సదుం: మండలంలోని గ్రామీణ యువతి, యువకులకు చదువుతో పాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై స్థానిక కలకడ షరీఫ్ సాహెబ్, ఫాతిమాబీ ట్రస్టు ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు శాస్త్రవేత్త కరీముల్లా తెలిపారు.

జీవవైవిధ్య సమతుల్యతకు కృషి.. సదుం: జీవవైవిధ్య సమతుల్యతకు అందరు కృషి చేయాలని జన విజ్ఞాన వేదిక పరిరక్షణ విభాగ కన్వీనర్ సుధాకర్ తెలిపారు. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో జీవవైవిధ్యం, ప్రాముఖ్యతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రతి విద్యార్థి ఒక మొక్కనైనా నాటి సంరక్షించాలన్నారు. ప్రధానోపాధ్యాయుడు జయకుమార్‌రెడ్డి, శాస్త్రవేత్త కరీముల్లా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పశువులకు వైద్యపరీక్షలు.. సదుం: జోగివారిపల్లె గ్రామంలో రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ, గోకుల్‌మిషన్ సహకారంతో పశువైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో 200 పశువులకు గర్భకోశ చికిత్సలు, నట్టల నివారణ, పిడుదుల మందు పిచికారి చేశారు. పశుపోషణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ జిల్లా ఉపసంచాలకులు శ్రీనివాసులునాయుడు, సుబ్బారావు, డాక్టర్లు తాబ్రీజ్‌బాషా, మునిచంద్ర, చందనప్రియ, సర్పంచి అనిత, రైతులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో చిన్నారులకు సేవలు .. శాంతిపురం: కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చిన సక్షం అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల పౌష్టికత పెంపు లక్ష్యంగా కార్యక్రమాలను చేపట్టనున్నట్లు స్థానిక సీడీపీఓ కల్పన తెలిపారు. మండల పరిధి కెనమాకులపల్లె పంచాయతీ ఆరిముత్తనపల్లెలో సక్షం అంగన్‌వాడీ కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. కల్లూరు: పులిచెర్ల ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో సోమవారం పౌష్టికాహార మహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు ఆహార పదార్థాలతో ప్రదర్శనగా ఏర్పాటు చేసి, ర్యాలీ నిర్వహించారు. సూపర్‌వైజర్‌లు విజయలక్ష్మీ, రమాదేవి, కార్యకర్తలు పార్వతీ, అన్నపూర్ణ, అమృతకుమారి, ప్రేమ తదితరులు పాల్గొన్నారు.

3 నుంచి శ్రీరామచంద్రస్వామి బ్రహ్మోత్సవాలు.. బైరెడ్డిపల్లె: తీర్థం శ్రీరామచంద్ర స్వామి ఆలయంలో ఈనెల 3 నుంచి 13వ తేదీ వరకూ స్వామివారి దసరా బ్రహ్మోత్సవాలు వేడుకగా నిర్వహించనున్నట్లు గ్రామస్థులు తెలిపారు. 3న ధ్వజారోహణం, కలశస్థాపన, మంటపోత్సవం, 4న హంస వాహనం, 5న సూర్యప్రభ వాహనం, 6న శేష వాహనం, 7న సింహ వాహనం, 8న హనుమంత వాహనం, 9న మోహినీ ఉత్సవం, సీతారాముల కల్యాణం, గరుడోత్సవం, 10న గజేంద్ర వాహనం, 11న రథోత్సవం, 12న అశ్వ వాహనం, 13న తోటోత్సవం ఉందన్నారు.

చింతల వీధిలో అన్నదానం.. పుంగనూరు, న్యూస్‌టుడే: పట్టణంలోని చింతలవీధిలో గల వినాయక మండపం వద్ద సోమవారం అన్నదానం చేశారు. వినాయక చవితి సందర్భంగా నెలకొల్పిన వినాయక మండపం వద్ద రోజు సాంస్కృతిక కార్యక్రమం, పూజలు, తీర్థప్రసాదాలు పంపిణీ చేస్తున్నారు.

విధుల నిర్వహణలో అంకితభావం అవసరం.. పుంగనూరు: విధుల నిర్వహణలో ప్రతి ఒక్కరికీ అంకిత భావం అవసరమని తహసీల్దారు రాము అన్నారు. సోమవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో పదవీ విరమణ చేసిన మాగాండ్లపల్లె వీఆర్వో సుబ్రమణ్యంరెడ్డిని సత్కరించారు. మండల తెదేపా అధ్యక్షుడు మాధవరెడ్డి, రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సైన్సు పట్ల అవగాహనకే చెకుముకి.. పుంగనూరు గ్రామీణ: విద్యార్థులకు సైన్సు పట్ల అవగాహన పెంచేందుకే చెకుముకి నైపుణ్య పరీక్ష నిర్వహిస్తునట్లు జేవీవీ కార్యదర్శి సుశీల సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 25న చెకుముకి టాలెంట్ టెస్టు పాఠశాల స్థాయి నిర్వహించగా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని 9 పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో ఎన్నికైన విద్యార్థులకు అక్టోబరు 1న మండల స్థాయి టాలెంట్ టెస్టు స్థానిక కొత్తయిండ్లు మున్సిపల్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

నేడు పొలం పిలుస్తోంది.. సోమల: మండలంలోని నెల్లిమంద, తమ్మినాయునిపల్లె పంచాయతీలోని గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఏవో సుధాకర్ తెలిపారు.

నేడు సామాజిక బహిరంగ సభ..పుంగనూరు: స్థానిక పీఆర్ అతిథి భవన ఆవరణలో మంగళవారం సామాజిక తనిఖీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు ఇన్‌ఛార్జి ఎంపీడీవో అబ్దుల్‌రహీం ఓ ప్రకటనలో తెలిపారు.

శ్రీవారి కల్యాణోత్సవానికి చురుగ్గా ఏర్పాట్లు .. కుప్పం గ్రామీణ: ఉర్లఓబనపల్లి సమీపంలోని బేటరాయస్వామి కొండ వద్ద ఈనెల 5న తితిదే ఆధ్వర్యంలో శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఇందుకోసం ఉత్సవ కమిటీ సభ్యులు అవసరమైన ఏర్పాట్లు చురుగ్గా చేపడుతున్నారు.

సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు

కుప్పం పట్టణం: పురపాలిక పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలతో ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార కార్యక్రమాన్ని వార్డుల్లో నిర్వహిస్తున్నట్లు కమిషనర్ శ్రీనివాసరావు అన్నారు. పురపాలిక పరిధిలోని 19వ వార్డులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. కౌన్సిలర్లు దామోదరం, సోము, నాయకులు గోపీనాథ్, జాకీర్, జనసేన ఇన్‌ఛార్జి నరేష్ తదితరులు ఉన్నారు.

విద్యాసంస్థల పరిసరాల్లో మద్యం దుకాణాలు వద్దు

కల్లూరు: డిగ్రీ కళాశాల పరిసరాల్లో మద్యం, బీడీ, సిగరెట్లు, గుట్కాలు, హాన్స్ దుకాణాలు పెట్టకుండా చర్యలు తీసుకోవాలని తహసీల్దారు జయసింహ, ఎస్సై వెంకటేశ్వర్లుకు కల్లూరు వీఆర్ఆర్ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం వాలంటీర్లు సోమవారం వినతిపత్రం సమర్పించారు. అంతకు ముందు కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు ర్యాలీని నిర్వహించారు. పాల్గొన్నారు.

విద్యార్థుల్లో నైపుణ్యాలు వెలికి తీయాలి

వి.కోట, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థుల్లో దాగిన క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీయాలని జడ్పీ ఛైర్మన్ శ్రీనివాసులు ఉపాధ్యాయులను కోరారు. మండల పరిధిలోని ముదరందొడ్డి ఉన్నత పాఠశాలలో పలమనేరు నియోజకవర్గ స్థాయి గ్రిగ్ మెమోరియల్ జోనల్ గేమ్స్ అండర్ 17 బాల బాలికల ఖోఖో పోటీలు నిర్వహించారు. పోటీల్లో 24 బాల బాలికల జట్లు పాల్గొన్నాయి. పోటీల్లో గెలుపొందిన వారికి నిర్వాహకులు మెమెంటోలు, ధ్రువపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు రంగనాథ్, హరి, సర్పంచ్ దామోదర్, వైస్ఎంపీపీ లక్ష్మణ్‌రెడ్డి పాల్గొన్నారు.

మద్యం విక్రేత అరెస్టు

పలమనేరు, న్యూస్‌టుడే: పట్టణంలోని దండపల్లె రోడ్డు వద్ద ముసలిమడుగు గ్రామానికి చెందిన తేజ అనే వ్యక్తిని పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. కర్ణాటక రాష్ట్రానికి చెందిన 480 మద్యం టెట్రా ప్యాకెట్లను స్కూటీ వాహనంపై తీసుకొస్తుండగా గుర్తించి పట్టుకున్నారు. అతని నుంచి మద్యం పాకెట్లతో పాటు ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై స్వర్ణతేజ తెలిపారు. ఈ దాడిలో ఏఎస్సై పళని, సిబ్బంది

పోటెత్తిన భక్తులు


వెండి మూలవిరాట్‌తో శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి

రామకుప్పం: మండల కేంద్రంలో వెలసిన శ్రీ వల్లీదేవ సేన సమేత సుబ్రహ్మణ్యస్వామి సోమవారోత్సవాల్లో భాగంగా నాలుగో సోమవారం ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం వేదపండితులు స్వామి, అమ్మవారికి అమృతాభిషేకాలు నిర్వహించి వెండి మూలవిరాట్, ప్రత్యేక పూలతో అలంకరించారు. ఉదయం నుంచే కుప్పం పలమనేరు నియోజకవర్గాలతో పాటు కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారికి మొక్కులు చెల్లించుకున్నారు. కుప్పం ఆర్డీవో శ్రీనివాసరాజు, గ్రామీణ సీఐ మల్లేష్‌యాదవ్ మయూర వాహనంపై స్వామి వారిని మాడవీధుల్లో ఊరేగించారు. ఆలయ ప్రాంగణంలోని శనీశ్వర స్వామి, నాగుల ముద్దమ్మ, వెంకటేశ్వర స్వామి, ఆంజనేయ స్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేసి, సాయంత్రం స్వామివారికి కావళ్లు చెల్లించారు. పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. భక్తులకు ఉచిత అన్న ప్రసాదాలు పంపిణీ చేశారు.


మొక్క నాటుతున్న శుభారాం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ విద్యార్థులు

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

పుంగనూరు గ్రామీణ, న్యూస్‌టుడే: పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యతని ప్రిన్సిపల్ రాజశేఖర్ తెలిపారు. సోమవారం స్థానిక శుభారాం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఎన్‌సీసీ 35ఎ బెటాలియన్ యూనిట్ చిత్తూరు జిల్లా బెటాలియన్ ఆదేశాల మేరకు ఏక్ పద్ మాకీ నామ్ (ప్రతి పిల్లవాడి తల్లి పేరు మీద మొక్క నాటడం), పరిసరాల పరిశుభ్రత గూర్చి వివరించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారి సోమరాజు, వైస్‌ప్రిన్సిపల్ శ్రీనివాస్, ఎన్ఎస్ఎస్ అధికారి రాజశేఖర్, ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు.

పోటీ ప్రపంచంలో ప్రతిభ నిరూపించుకోవాలి

కుప్పం పట్టణం: విద్యార్థుల్లోని సృజనాత్మకత వెలికితీస్తేనే పోటీ ప్రపంచంలో ప్రతిభను నిరూపించుకోవచ్చునని మానసిక నిపుణులు, ఉరవకొండ కళాశాల ఈఈఈ విభాగాధిపతి డా.సురేష్‌బాబు అన్నారు. స్థానిక ప్రభుత్వ వైసీ జేమ్స్ ఎన్ పాలిటెక్నిక్ కళాశాలలో సోమవారం సృజనాత్మకత క్లిష్టమైన ఆలోచనలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. టెక్నాలజీ మాయలో పడి విద్యార్థులు విద్యను అలసత్వం చేస్తున్నారని, టెక్నాలజీని ఎంత తక్కువ వాడితే అంత మంచిదని సూచించారు. కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ సుబ్బన్న, అధ్యాపకులు సయ్యద్ హుస్సేన్, నరసింహులు, నిరంజన్, వరుణ్, జోసెఫ్, రమేష్, విద్యార్థులు పాల్గొన్నారు.


విద్యార్థులతో మానసిక నిపుణులు డా.సురేష్‌బాబు

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

సోమల, న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయి పోటీలకు కందూరు, సోమల ఉన్నత పాఠశాలలకు చెందిన ఐదుగురు విద్యార్థులకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు వెంకట్రామణరెడ్డి, హరినాథ్‌లు తెలిపారు. అన్నమయ్య జిల్లా గారంపల్లె గురుకుల పాఠశాలలో ఉమ్మడి చిత్తూరు జిల్లా స్థాయి అండర్-19 క్రీడలు జరిగాయి. క్రీడల్లో మండలంలోని కందూరు ఉన్నత పాఠశాలకు విద్యార్థులు లహరి, రుచిత, దినేష్, రాహుల్, సోమల ఉన్నత పాఠశాలకు చెందిన సయ్యద్ ఫారుఖ్ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి త్రోబాల్ పోటీలకు ఎంపికయ్యారన్నారు.